ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 25 ఏప్రిల్ 2025

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విభిన్న ప్రతిభావంతులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మంత్రి, కలెక్టర్, డీవైఈవో

రాయచోటి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి ఉన్నత పాఠశాలలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ తదితర పరికరాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ వంటి పరికరాలను అందచేస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఎవరికీ తక్కువ కాదని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం వారికి అందించే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 243 మంది విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ తదితర పరికరాలు అందచేశారు. కార్యక్రమంలో డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీలు, విభిన్న ప్రతిభావంతులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన విభిన్న ప్రతిభావంతులు, వారి తల్లిదండ్రులు

రెఫరల్ ఆస్పత్రి

● సమస్యల వలయంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రి



వీల్ చైర్ లేక మెట్లు ఎక్కడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధుడు



మదనపల్లె జిల్లా ఆస్పత్రి

● చిన్న గాయమైనా తిరుపతికి వెళ్లాల్సిందే...
● తీవ్రంగా ఉన్న డాక్టర్ల కొరత
● వైద్యం అందక ఇబ్బందుల్లో రోగులు
● మందులు బయట తెచ్చుకోవాలని సూచిస్తున్న డాక్టర్లు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన మదనపల్లె జిల్లా సర్వజన ఆస్పత్రి నేడు డాక్టర్లు లేక.. మందులు రాక రెఫరల్ ఆస్పత్రిగా మారిపోయింది. ప్రమాదం జరిగి ఏ చిన్న గాయమైనా డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ల కొరత అధికంగా ఉంది. 80 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 17 మంది డాక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన వారు బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానాలన్నీ ఖాళీగా ఉన్నాయి. ఓపీ మాత్రం వందల సంఖ్యలో ఉంది. ముఖ్యంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మదనపల్లె నియోజకవర్గం నుంచే కాకుండా తంబళ్లపల్లె, పీలేరు, పలమనేరు నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన రోగులకు వైద్యుల కొరతతో సరైన వైద్యం అందించలేకపోతున్నారు. చిన్న గాయమైనా తిరుపతికి రెఫర్ చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఈ ఆస్పత్రిని కలెక్టర్ శ్రీధర్ పర్యవేక్షించినా, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనిఖీలు నిర్వహించి హెచ్చరించినా తీరు మాత్రం మారలేదు. వైద్య విధాన పరిషత్‌లో ఉన్న జిల్లా ఆస్పత్రిని వైసీపీ ప్రభుత్వంలో సర్వజన బోధనాస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడి ప్రభుత్వ మెడికల్ కళాశాలను క్యాన్సల్ చేస్తున్నట్లు ప్రకటన చేసి ఇక్కడ పనిచేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు డాక్టర్లను బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. ఉన్న డాక్టర్లు ఏమి చేయాలో తెలియక సీనియర్ డాక్టర్ల కొరత కారణంగా చిన్న గాయాలకు, వేలు విరిగినా సరే రెఫర్ చేయక తప్పడం లేదంటున్నారు. గైనకాలజీ ఆపరేషన్ థియేటర్‌లో ఏసీ పనిచేయడం లేదు. సిబ్బంది కొరత కారణంగా ప్రమాదాలు, ఇతర సమస్యలతో వచ్చిన రోగులను ఆస్పత్రిలోకి తీసుకెళ్లడానికి కూడా సిబ్బంది అందుబాటులో లేక క్షతగాత్రుల బంధువులే వీల్ చైర్, స్ట్రెచర్‌లలో వారే తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇటీవల బి.కొత్తకోటకు చెందిన యువకుడు ప్రమాదంలో గాయపడి రాత్రి సమయంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేరితే డాక్టర్లు సక్రమంగా వైద్యం అందివ్వలేదని ఉదయాన్నే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిపోయాడు. అలాగే ముదివేడు వద్ద రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే డాక్టర్లు నిర్లక్ష్యం వహించారని అందుకే మా అబ్బాయి మృతి చెందాడని మృతుడి బంధువులతో పాటు ప్రజాసంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన, ఆందోళనలు చేశారు.

మందుల కొరత

మదనపల్లె జిల్లా ఆస్పత్రికి గతంలో నెలకు రూ.30 లక్షలకు పైగా విలువైన మందులు తదితరాలు వచ్చేవి. ప్రస్తుతం రూ.10 లక్షలకు కూడా మందులు ప్రభుత్వం పంపడం లేదని సిబ్బంది చెబుతున్నారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. ప్రతి రోగికి ప్యారసీటమాల్ మాత్ర తప్ప మరొకటి డాక్టర్లు ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన మాత్రలు, మందులు అవసరం అయితే చీటీ రాసి బయట కొనుక్కోమంటున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. వారు చేసేది లేక సొంతడబ్బులు ఖర్చు చేసి బయట మందులు కొనుగోలు చేస్తున్నారు. కరెంట్‌పోతే ఆస్పత్రి అంధకారంలో ఉండక తప్పడం లేదు. జనరేటర్ ఉన్నా కరెంట్‌పోయిన వెంటనే ఆన్ చేయడం లేదని తెలుస్తోంది. దీంతో ఆస్పత్రి అంధకారంలో ఉండిపోతోంది. అరగంట సేపు చూసిన తర్వాత కరెంట్ రాకపోతే అప్పుడు జనరేటర్ వేస్తున్నట్లు రోగులు చెబుతున్నారు.



కరెంట్ పోవడంతో అంధకారంలో ఉన్న ఆస్పత్రి

చిన్న గాయమైనా రెఫర్

మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రోజుకు సరాసరిన 8 మంది రోగులను తిరుపతికి రెఫర్ చేస్తున్నట్లు చెబుతున్నారు. చిన్నగాయం అయినా, వేలు విరిగినా రెఫర్ చేస్తున్నారు. దీంతో మండలాల్లో 108 అందుబాటులో లేకుండా పోయి ఎమర్జెన్సీ కేసుల రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. రెఫర్‌లు తగ్గించాలని, ఎంతో అత్యవసరం అయితేనే రెఫర్ రాయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపినా ఎటువంటి స్పందన లేదు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ప్రతి బుధవారం నిర్వహించే సదరం సర్టిఫికెట్‌కు వచ్చే దివ్యాంగులు పై ఫ్లోర్‌లోకి ఎక్కలేక చాలా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు.

కొద్ది రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు ఉండడం వాస్తవమే. ప్రస్తుతం ఆస్పత్రి ఏ స్టేజీలో ఉంది. ప్రభుత్వ ఏమి నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి. ఉన్నకాడికి రోగులకు వైద్యం అందించడానికి ప్రయత్నం చేస్తున్నాం. మందుల కొరత ఉంది. రెఫర్లు తగ్గించాలని డాక్టర్లకు సూచించాం. ఆస్పత్రి బడ్జెట్ పూర్తిగా తగ్గించేశారు. దీంతో మందుల కొరత ఉంది. మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తాం.

- డాక్టర్ కోటేశ్వరి, సూపరింటెండెంట్, మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

ఎంతపని చేశావమ్మా...!

● పదిలో ఫెయిల్ అయ్యానన్న మనస్థాపం...
● ఉరి వేసుకుని బలవన్మరణం...పెద్దమరువపల్లెలో విషాదం



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని నవీన

ములకలచెరువు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎంత పనిచేశావమ్మా... పదవ తరగతిలో ఫెయిల్ అయ్యావని మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా అంటూ ఆ విద్యార్థిని తల్లిదండ్రుల రోదన చూపరులను కలచివేసింది. పదో తరగతిలో ఫెయిల్ అయ్యానన్న మనస్థాపంతో విద్యార్థిని చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు...ములకలచెరువు మండలం సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్దమరువపల్లెకు చెందిన చల్లా రెడ్డెప్ప కుమార్తె నవీన (15) బురకాయలకోటలోని జడ్పీ హైస్కూల్‌లో చదువుతూ ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షలు రాసింది. ఈ క్రమంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో పాసైంది. మిగిలిన తెలుగు, మ్యాథ్స్, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల్లో తప్పింది. దీంతో మనస్థాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మోల్డింగ్ కుండీకి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూలి పనికి వెళ్లిన తల్లిదండ్రులు వచ్చి చూసి వేలాడుతున్న నవీనను కిందకు దింపగా అప్పటికే మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. బాలిక మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

5280 లీటర్ల సారా ఊట ధ్వంసం



పెద్దతాండా అటవీ ప్రాంతంలో సారాబట్టీలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

● 21 కేసులు నమోదు.. 13 మంది అరెస్ట్
● డ్రోన్ ఉపయోగించి సారా బట్టీల గుర్తింపు
● కడప జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజు

పీలేరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి); పీలేరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మెరుపు దాడులు నిర్వహించి 5280 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కడప జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. గురువారం కేవీపల్లె మండలం జిల్లేలమంద పంచాయతీ పరిధిలోని పెద్దతాండా పరిసర అటవీ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాటుసారా అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయంలో భాగంగా ఈ నెలలో సర్కిల్ పరిధిలో మెరుపు దాడులు నిర్వహించి 37 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 21 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే 13 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన ముగ్గురి నుంచి రూ.25 వేలు జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. 109 మంది అనుమానితులు, పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు చెప్పారు. అక్రమంగా ఎవరైనా నాటుసారా తయారు చేయడం, ఇతర ప్రాంతాలకు తరలించడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతానికి భిన్నంగా అటవీ ప్రాంతాలలో దాడులు నిర్వహించేటప్పుడు డ్రోన్ కెమెరాలను ఉపయోగించడం గమనార్హం. ఈ దాడిలో కడప అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్, ఏఎస్పీ వై.జోగేంద్ర, పీలేరు ఎక్సైజ్ సీఐ వి.సుబ్బారెడ్డి, కడప, రాజంపేట, రాయచోటి, పీలేరు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, కడప, కలకడ, కేవీపల్లె ఎస్ఐలు, రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



కేవీపల్లె మండలం జిల్లేలమంద పెద్దతాండాలో దాడులకు సిద్ధంగా ఉన్న ఎక్సైజ్ అధికారులు

కారుమంచి సంయుక్తకు ఉత్తమ సర్పంచ్ అవార్డు



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కారుమంచి సంయుక్త

రైల్వేకోడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త ఉత్తమ సర్పంచ్ అవార్డును గురువారం విజయవాడలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మైసూరివారిపల్లె పంచాయతీలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని అందించినందుకు తనను ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేశారని తెలిపారు. అంతేకాకుండా మైసూరివారిపల్లె గ్రామ పంచాయతీలో నూటికి నూరుశాతం మంచినీటి సదుపాయం కల్పించిందుకు ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ముక్కా పౌండేషన్ అధ్యక్షురాలు ముక్కా వరలక్ష్మీ, రైల్వేకోడూరు ఎంపీడీవో నాగార్జున రావు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రజాధనం స్వాహా..!



రూ.1.88 కోట్ల నిధులు పక్కదారి పట్టిన వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం

● రూ.2.93 కోట్ల పంచాయతీ నిధులు పక్కదారి
● ఒక్క వేంపల్లెలోనే రూ.1.88 కోట్లు బొక్కేశారు
● వైసీపీ పాలనలో సర్పంచ్‌ల ఇష్టారాజ్యం
● వెలుగులోకి వస్తున్న నాటి అవినీతి

కడప రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మంత్రుల స్థాయి నుంచి సర్పంచ్ వరకూ.. అవినీతిలో ఎవ్వరూ తగ్గేదేలా అనేలా వ్యవహరించారు. జగన్ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ నేతల అండతో అత్యధికమంది సర్పంచ్‌లు కొలువుదీరారు. వీరిలో చాలామంది అభివృద్ధి మాటున అవినీతికి తెరలేపారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని అడ్డదారుల్లో కొల్లగొట్టారు. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో కేవలం 13 పంచాయతీల్లోనే రూ.2.93 కోట్ల నిధులను స్వాహా చేశారు. మిగిలిన పంచాయతీల్లో ఇంకెన్ని రూ.కోట్లు తిన్నారో..? ఒక్క వేంపల్లె పంచాయతీలోనే రూ.1.88 కోట్లు బొక్కేశారు. ఒంటిమిట్ట మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా ఏకంగా 10 పంచాయతీల్లో రూ.91.67 లక్షలు ఆరగించారు. పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు పంచాయతీలో రూ.10.57 లక్షలు, చాపాడు మండలం బద్రిపల్లెలో రూ.2.56 లక్షలు బొక్కేశారు. పంచాయతీలకు వచ్చే నిధుల్లో సింహభాగం అప్పట్లో జగన్ ప్రభుత్వం ఇతరవాటికి మళ్లించేసింది. మిగిలిన అరకొర నిధులను ఇలా సర్పంచ్‌లు కార్యదర్శులతో కుమ్మక్కై నొక్కేశారు. దీనిపై వైసీపీ హయాంలో ఫిర్యాదు చేయాలన్నా భయపడేవారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీలలోని అవినీతిపై ఫిర్యాదుల పర్వం ప్రారంభమైంది. దీంతో అవినీతి సర్పంచ్‌ల బాగోతం వెలుగులోకి వస్తోంది.

వేంపల్లెలో ముగ్గురు కార్యదర్శులు..

మేజర్ గ్రామ పంచాయతీ అయిన వేంపల్లెలో ముగ్గురు కార్యదర్శులు పనిచేస్తున్నారు. 2023-24 వైసీపీ హయాంలో ఈ పంచాయతీలో ఏకంగా రూ.1.88 కోట్లను స్వాహా చేశారు. ఇందుకు సంబంధించి ముగ్గురు కార్యదర్శులకు అవినీతి ఉచ్చు బిగుసుకుంది. ఇప్పటికే స్వాహా అయిన సొమ్ములో రూ.51 లక్షలను వీరు తిరిగి జమచేసినట్లు సమాచారం.

ఎల్లటూరు సర్పంచ్ రాజీనామా

పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు సర్పంచ్ పంచాయతీ నిధులను స్వాహా చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. కలెక్టర్ ఆదేశాలమేరకు పంచాయతీశాఖ విచారణకు ఆదేశించింది. ఎల్లటూరు గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు, జనరల్ ఫండ్ నిధులు కలిపి రూ.10,57,827లు 2023-24లో మూడు విడతలుగా పక్కదారి పట్టించినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. పంచాయతీ సెక్రటరీ పర్యవేక్షణ లోపమే కారణంగా కమిటీ గుర్తించింది. ఇంతలో ఎల్లటూరు సర్పంచ్ తన పదవికి రాజీనామా చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు పంచాయతీ కార్యాలయం

ఒంటిమిట్ట మండలంలో..

ఒంటిమిట్ట మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో ఏకంగా 10 పంచాయతీలలో రూ.91,67,946 తినేశారు.

పంచాయతీ	స్వాహా చేసిన నిధులు
పెన్నపేరూరు	రూ.8,82,529
రాచగుడిపల్లె	రూ.19,34,633
గొల్లపల్లె	రూ.6,89,083
గంగపేరూరు	రూ.1,30,600
నర్వకాటుపల్లె	రూ.8,05,124
నడింపల్లి	రూ.11,75,977
కోనరాజుపల్లె	రూ.10,72,394
చింతరాజుపల్లె	రూ.10,56,529
సాలాబాద్	రూ.14,21,077
కొండమాసుపల్లె	రూ.3,11,664

నిధుల దుర్వినియోగం వాస్తవమే

పెండ్లిమర్రి మండలం వెల్లటూరు పంచాయతీలో రూ.10,57,827లు దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలింది. అప్పటి గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీపతి నిర్లక్ష్యం వలనే నిధులు దుర్వినియోగం అయ్యాయని అతనిని ఎందుకు సస్పెండ్ చేయకూడదో సమాధానం ఇవ్వాలని, అలాగే గ్రామ సర్పంచ్ చెక్‌పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో సమాధానం ఇవ్వాలని ఇద్దరికీ నోటీసులు జారీ చేశాం. వేంపల్లెలో రూ.1.88 కోట్లు దుర్వినియోగం వాస్తవమే. ఇప్పటికే అక్కడ రూ.51లక్షలు రికవరీ చేశాం. ఒంటిమిట్ట మండలం విషయం కూడా మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరుగుతోంది.



- రాజ్యలక్ష్మి, పంచాయతీశాఖ జిల్లా అధికారి

ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు

● క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లపై కఠినంగా వ్యవహరించాలి
● నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి



నేర సమీక్షలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి, దర్యాప్తును వేగవంతం చేసి పరిష్కరించాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై నిఘా ఉంచాలని, మరోసారి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా హెచ్చరించాలని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సుండుపల్లెలో
ఘరానా మోసం

సుండుపల్లెలో దొంగ పాసుపుస్తకాల గుట్టు రట్టయింది. ఒక్కో పాసుపుస్తకానికి రైతుల వద్ద నుంచి వేలు, లక్షల్లో వసూళ్లకు పాల్పడినట్లు ఓ రైతు ఫిర్యాదుతో వెలుగు చూసింది. మండలానికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయంలో తిరుగుతూ గతంలో సుండుపల్లెలో అటెండర్‌గా పనిచేసిన తన భార్య ఉద్యోగాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. ప్రస్తుతం అతడి భార్య ఇక్కడ పనిచేయకపోయినా అక్రమ పాసుపుస్తకాలు, దొంగ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట సాక్ష్యాలతో సహా వెలుగులోకి రావడంతో మండలంలో ఆ వ్యక్తిని నమ్మి మోసపోయిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

- అక్రమ పాసుపుస్తకాల పేరిట బురిడీ
- అధికార ముద్ర, సంతకాలు ఫోర్జరీ
- రైతుల నుంచి లక్షల్లో వసూళ్లు
- పోలీసులకు ఓ రైతు ఫిర్యాదు


బాధిత రైతు అన్నారపు నారాయణ

సుండుపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీ జేసీ కురవపల్లికి చెందిన అన్నారపు నారాయణ అనే రైతును పూజారి నాగన్న అనే వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల క్రితం.. 'నీకు స్థలం ఉంది కదా.. నువ్వు ఇలాగే ఉంటే ఎలా? నాతో మాట్లాడు.. మా సార్‌తో మాట్లాడి పట్టా చేయిస్తా'నని చెప్పారని తెలిపారు. ఆ తర్వాత నెల రోజుల తర్వాత ఫోన్ చేసి పట్టా చేయిస్తానని రూ.50 వేలు తీసుకుని మోసం చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను తన భార్య కేరళలో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నావని, రూ.50 వేలు సంపాదించాలంటే సుమారు మూడు నెలలు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. డబ్బులు తీసుకోవడంతో పాటు దొంగ పాసుపుస్తకం జారీ చేసి తమ కడుపు కొట్టారని వాపోయాడు. మోసపోయిన విషయం తెలుసుకుని పూజారి నాగన్నకు ఫోన్ చేస్తే బెదిరిస్తున్నాడని, సుండుపల్లె ఎస్‌ఐ, తహసీల్దార్‌లు తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ అక్రమ పాసుపుస్తకాల జారీ వెనుక ఒకరిద్దరు వీఆర్‌వోల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.


దొంగ పాసుపుస్తకం సిద్ధం చేసిన దృశ్యం


పాసుపుస్తకంలో ఫోర్జరీ సంతకాలు, ఫోర్జరీ అధికార ముద్ర

పెద్ద సంఖ్యలో అక్రమ పట్టాలు జారీ

మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలకు గిరాకీ ఉండడంతో ఇంటి పట్టాల నుంచి పాసుపుస్తకాల వరకు పెద్ద మొత్తంలో నగదు చేతులు మారి అక్రమ పట్టాలు వెలుగు చూసినట్లు సమాచారం. గత ఐదు సంవత్సరాల్లో వందల సంఖ్యలో జగనన్న కాలనీలకు, ఇతర విలువైన ప్రభుత్వ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ అయ్యాయి. ఇవన్నీ ప్రస్తుతం నిర్మాణాలు, అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రెవెన్యూ అధికారులే అని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయంపై ఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా అక్రమ పాసుపుస్తకాలకు సంబంధించి ఓ వ్యక్తి డబ్బు తీసుకుని మోసం చేసినట్లు రైతు తమకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు.

మాన్యువల్ పాస్ పుస్తకాల జారీ జరగలేదు

తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎటువంటి పాసుపుస్తకాలు జారీ కాలేదు. 2015 సంవత్సరం తరువాత మాన్యువల్ పాసుపుస్తకాల జారీని ప్రభుత్వం నిలిపివేసింది. ఆ పాసుపుస్తకాలు జారీ చేసిన వ్యక్తికి, తహసీల్దార్ కార్యాలయానికి సంబంధం లేదు.

- దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె

రంగసముద్రం చెరువులో
అక్రమంగా చేపలవేట

- వేలం నిర్వహించని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి


చేపల వేట కోసం చెరువు వద్ద ఏర్పాట్లు చేసుకున్న జాలర్లు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒక్కటైన రంగసముద్రం చెరువులో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా చేపలు పట్టుకునేందుకు జాలర్లను దింపారు. రంగసముద్రం చెరువులో చేపల వేట వేలం ద్వారా గత ఆర్థిక సంవత్సరానికి రూ.17 లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. అయితే ఆ గడువు ముగియడంతో మళ్లీ వేలం పాటలకు అధికారులు నిర్ణయించారు. అయితే చెరువు మాకే కావాలని అప్పటి వైసీపీ మద్దతుదారులైన పాత వేలం పాటదారులు అధికారులతో కుమ్మక్కై వారికే వేలం దక్కేలా చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆయకట్టుదారులు, గ్రామస్థులు అధికారుల తీరును ఎండగట్టి వేలం పాటలను రద్దు చేయించారు. బహిరంగ ప్రకటన ఇచ్చి వేలం పాటలను నిర్వహించాలని కోరారు. మళ్లీ నెల రోజుల క్రితం రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చి వేలం పాటలు నిర్వహించడానికి పంచాయతీ అధికారులు సమాయత్తమయ్యారు. ఇందులో కూడా గోల్‌మాల్ జరుగుతోందని గ్రహించిన గ్రామస్థులు దానిని కూడా అడ్డుకున్నారు. ఈసారి పారదర్శకంగా వేలం పాటలు నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వేలం పాటలు నిర్వహించలేదు. వేలం పాట నిర్వహిస్తే దాదాపు రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే పాత వేలం పాటదారులు చెరువులో చేపలను పట్టడానికి జాలర్లను దింపడంతో గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే వేలం పాటలను నిర్వహించాలని కోరుతున్నారు. అక్రమంగా చేపలు పడుతున్న వారిని అడ్డుకుంటామని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్‌ను వివరణ కోరగా చెరువు వేలం వివాదం కోర్టులో ఉందని, బహిరంగ వేలం త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాట నిర్వహించే వరకు ఎవరూ చెరువులో చేపలు పట్టకూడదని, అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రిటైర్డు ఎస్ఈ పెన్షన్‌లో 10 శాతం కోత

కలికిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పనిచేసి శ్రీకాకుళంలో పదవీ విరమణ చేసిన బి.ఎస్.శ్రీనివాసులు నెలవారీ పెన్షన్‌లో 10 శాతం శాశ్వత కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన కడపలో పనిచేసే కాలంలో 2015లో తాగునీటి సరఫరా శాఖ కు అవసరమయ్యే పైపులు, ఇతర పరికరాలు సరఫరా చేయడానికి నిబంధనలకు విరుద్ధంగా అత్యధికంగా ధరలు పెంచి కొనుగోలుకు అనుమతించినట్లు ప్రధాన అభియోగం. ఇందులో ఎస్ఈ శ్రీనివాసులు అనేక అక్రమాలకు పాల్పడ్డట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు నిగ్గు తేల్చింది. విజిలెన్స్ నివేదికపైన ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.రాజేశ్వర రావు విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. అనంతరం శ్రీనివాసులు వైపు నుంచి అందిన సంజాయిషీలను పరిశీలించి మరో ఇంజనీర్ ఇన్ చీఫ్-3 కె.కిశోర్‌కుమార్‌కు విచారణను అప్పగించారు.

ఆ తరువాత మరో ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు పి.సంజీవరెడ్డి, టి.గాయత్రీదేవిలను విచారణాధికారులుగా నియమించారు. అన్ని విచారణల్లోనూ అక్రమాలు రుజువైనట్లు తేలడంతో చివరగా ఎస్ఈ శ్రీనివాసులు వాదనలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే శ్రీనివాసులు సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో చివరకు ఆయన పెన్షన్‌లో శాశ్వతంగా 10 శాతం కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

స్థానిక జాతి చెట్లను అభివృద్ధి చేయాలి : డీఎఫ్‌వో


కార్యక్రమంలో మాట్లాడుతున్న కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్

కడప ఎన్జీఆర్ సర్కిల్/సిద్దవటం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతి చెట్లను అటవీ ప్రాంతాల్లో ఇతర ప్రదేశాల్లో అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని జిల్లా అటవీ అధికారి వినీత్ తెలిపారు. కడప స్థానిక అటవీ పునరుద్ధరణ ప్రాజెక్టు ప్రారంభం కార్యక్రమాన్ని వైఎస్సార్ అటవీ విభాగం ఆధ్వర్యంలో రాజీవ్ స్మృతివనంలో గురువారం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని డీఎఫ్‌వో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవి జంతువుల రక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. అటవీ సంరక్షణలో భాగంగా నర్సరీలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. వర్మీకంపోస్టు తయారీ విధానం కూడా ప్రజలకు వివరించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు అటవీ శాఖ సిబ్బంది తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

కార్యక్రమంలో కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్, కడప డ్వామా ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీవోలు, సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, అటవీశాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

తీర్థయాత్రకు వెళ్లి ఆర్టీసీ డ్రైవర్ మృతి


భాస్కరశెట్టి (ఫైల్)

పీలేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులతో సహా తీర్థయాత్రలకు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ మరణించిన సంఘటన గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన దేవతి భాస్కరశెట్టి (52) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ముషీరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 21న కోటప్పకొండ, మంగళగిరి, అమరావతి, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రకు వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం అన్నవరం ఆలయ దర్శనానంతరం లాడ్జీలోని రూము ఖాళీ చేసి వస్తుండగా కాలు జారి మెట్ల మీద నుంచి జారిపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నందలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రచెరువుపల్లెలో గత యేడాది జరిగిన హత్యకేసులో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఆయన కథనం మేరకు... సత్తుపల్లె వెంకటరెడ్డి అదే గ్రామానికి చెందిన నాగప్రతాప్‌రెడ్డిల మధ్య కోడిపుంజు విషయమై 2024లో జూలై 27న గొడవ జరిగింది. వెంకటరెడ్డి నాగప్రతాప్‌రెడ్డిని అసభ్యకరంగా తిట్టగా నాగప్రతాప్‌రెడ్డిని అతడి ఇంటిలోనికి తీసుకెళ్లి మచ్చుకత్తితో తలమీద నరికాడు. మరుసటిరోజు వెంకటరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగప్రతాప్ రెడ్డి అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. నందలూరు పోలీసుస్టేషన్‌లో క్రైం నంబరు 99/2024యు/ఎస్103(1) హత్య కేసులోని నిందితుడి గురించి వచ్చిన సమాచారం మేరకు రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ నందలూరు సిబ్బందితో నాగిరెడ్డిపల్లె గ్రామంలోని పాత ఆర్‌అండ్‌బీ బంగ్లా దగ్గర నిందితుడు నాగప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన మచ్చుకత్తిని స్వాధీనపరుచుకుని రిమాండ్‌కు పంపించామన్నారు. కాగా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు పోలీసుస్టేషన్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

అక్రమాస్తుల కేసు నుంచి ఏఎస్‌వోకు విముక్తి

కలికిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసరు (ఏఎస్‌ఓ)గా పనిచేసి పదవీ విరమణ చేసిన చింతపల్లి గోవిందరాజులుకు అక్రమాస్తుల కేసు నుంచి పదేళ్ల తరువాత విముక్తి కలిగిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2015లో గోవిందరాజులు అక్రమాస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం గోవిందరాజులుపై ప్రాసిక్యూషన్ చర్యలకు ప్రభుత్వం 2017 ఏప్రిల్ 24 ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ప్రాసిక్యూషన్ ఆదేశాలపై గోవిందరాజులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు ప్రభుత్వ ప్రాసిక్యూషన్ ఆదేశాలను కొట్టేస్తూ గోవిందరాజులుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై ప్రభుత్వం హైకోర్టులోనే అప్పీల్ పిటీషన్ దాఖలు చేసింది.

ఈలోగా హైకోర్టు తీర్పు మేరకు అక్రమాస్తుల కేసు నుంచి తనకు విముక్తి కలిగించాలని ప్రభుత్వానికి విన్నవించారు. అయితే తీర్పు వెలువడిన తరువాత అప్పీలు పిటీషన్ దాఖలు చేసే వ్యవధికి సంబంధించి సాంకేతికపరమైన సమస్య రావడంతో చివరకు తన అప్పీలు పిటీషన్ ఉపసంహరించుకోవాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు సూచిస్తూ ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో గోవిందరాజులుపై నమోదైన అక్రమాస్తుల కేసులో ఆయనకు ప్రాసిక్యూషన్ నుంచి విముక్తి లభించినట్లయ్యింది.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా


రాయచోటిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా గురువారం రాయచోటి, మదనపల్లె, రాజంపేట సబ్ డివిజన్ల పరిధిలో పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రాయచోటిలో అర్బన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 మోటారు సైకిల్స్, 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 27 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల నాకాబందీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలపై ఈ చలానాలు నమోదు చేసి ఒక లక్షా 9 వేల 9 వందల 75 రూపాయలు జరిమానా విధించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. రాత్రి సమయాల్లో చిన్నచిన్న సంఘటనలు పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతుందన్నారు.

వీఆర్‌వోపై దాడి ఘటనలో డీఎస్పీ విచారణ


తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

గాలివీడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పందికుంట వీఆర్‌వో జయన్నపై జరిగిన దాడి ఘటనలో రాయచోటి డీఎస్పీ ఎస్.మహేంద్ర విచారణ చేపట్టారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహసీల్దార్ భాగ్యలత, సిబ్బందితో సమావేశమై దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత వీఆర్‌వోతో కలిసి దాడి జరిగిన ప్రదేశంలో దాడి ఎలా జరిగిందన్న విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఈ దాడి ఘటనలో సాక్షులుగా ఉన్న సిబ్బందిని వేర్వేరుగా ఒక్కొక్కరిని విచారించి సమాచారం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో నిందితులుగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ హేమసుందర్‌రెడ్డి ఆయన తండ్రి రామచంద్రారెడ్డిపై ఇది వరకే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్‌ఐ రామక్రిష్ణ, ఆర్‌ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బాహుబలి' యంత్రాలు

- 95 టన్నుల గడ్డర్లను అవలీలగా ఎత్తేసిన క్రేన్లు
- ఫ్లైఓవర్ నిర్మాణాల్లో కీలకంగా మారిన క్రేన్లు


పిల్లర్లపై గడ్డర్‌ను ఎత్తి పెడుతున్న క్రేన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఐదు టన్నుల బరువుండే లాకర్లను ఏదైనా ఎత్తయిన భవనాల పైకి ఎత్తాలంటేనే క్రేన్ల సహాయంతో ఆపసోపాలు పడాల్సి ఉంటుంది. అలాంటిది 95 టన్నుల గడ్డర్లను 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదికి చేర్చాలంటే ఇంకెంత పెద్ద క్రేన్లు అవసరమో తెలుస్తుంది. మదనపల్లె మండలం ఆరోగ్యవరం దిగువన నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద అలాంటి బాహుబలి క్రేన్లు రెండు చూపరులను ఆశ్చర్యానికి గురి చేశాయి. మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎన్‌హెచ్-71 కింద తిరుపతి-మదనపల్లె ట్రంకు రోడ్డు క్రాసింగ్ అవుతోంది. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి నాలుగు పిల్లర్లను కూడా సిద్ధం చేశారు. సుమారు నాలుగు నెలలుగా ఈ పిల్లర్ల సమీపంలోనే ఎనిమిది గడ్డర్లను కాంట్రాక్టు సంస్థ ఆర్‌సీసీ ద్వారా తయారు చేసింది. ఒక్కో గడ్డర్ సుమారు 95 టన్నుల దాకా బరువు ఉంటుంది. ఇలాంటి గడ్డర్లను ఎనిమిందిటిని పిల్లర్ల పైకి ఎత్తేంతుకు ప్రత్యేక క్రేన్లను తెప్పించారు.

బాహుబలి క్రేన్లు

ఎన్‌హెచ్-71 నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రత్యేకంగా రూ.8 కోట్లు పెట్టి అత్యాధునికంగా పనిచేసే రెండు బాహుబలి క్రేన్లను కొనుగోలు చేశారు. ఈ క్రేన్లు అంతా ఎలక్ట్రానిక్ పద్ధతులతో, సెన్సార్లతో అతి బలమైన ఉక్కు తీగలు, క్రేన్లతో తయారు చేశారు. ఒక్కో క్రేన్ గరిష్టంగా ఎత్తే బరువు 48 టన్నులు కాగా, రెండు క్రేన్ల సహాయంతో ఒక్కో గడ్డర్‌ను ఎత్తి పిల్లర్లపై పెడుతున్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాటు, తప్పు జరిగినా కోట్ల విలువైన యంత్రాలు పాడవటంతో పాటు, విలువైన కార్మికుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో నిష్ణాతులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో గడ్డర్లను భారీ ట్రాలీ లారీల్లో ఎక్కించి పక్కనే వున్న పిల్లర్ల వద్దకు ఇంచి, ఇంచి జరుపుకుంటూ వచ్చారు. ఒక గడ్డర్‌ను రెండు చివర్లా రెండు క్రేన్లు సమానంగా ఉక్కుతీగలతో కట్టి అర అడుగు చొప్పున, రెండు వైపులా ఒకే ఎత్తులో ఉండేలా పైకి ఎత్తారు. ఇలా 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదకు ఒక్కో గడ్డర్‌ను ఎక్కించేందుకు రెండు గంటల సమయం పట్టింది. ఇలా ఎనిమిది గడ్డర్లను ఎత్తేందుకు ఇంజనీర్లు రెండు రోజుల సమయం తీసుకున్నారు.

ఫ్లైఓవర్ల నిర్మాణంలో కీలకం

మదనపల్లె నుంచి పీలేరు వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల రహదారి మార్గంలో పలుచోట్ల రోడ్ల క్రాసింగ్‌లు, చెరువు, నదులు ఉండటంతో ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను డిజైన్ చేసి నిర్మించారు. 52 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై సుమారు 30 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. సిమెంటు గడ్డర్లతో పిల్లర్లపైన నిర్మించే బ్రిడ్జిలు (ఫ్లైఓవర్లు) ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కో గడ్డర్ ఎంత లేదన్నా 95 టన్నుల బరువు ఉంటుంది. వీటిని ఎత్తి పిల్లర్లపైకి పెట్టేందుకు నిర్మాణ సంస్థ రూ.8 కోట్లతో రెండు బాహుబలి క్రేన్లను తెప్పించడంతో ఇవే కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో నిర్మాణంలో ఫ్లైఓవర్లను చాకచక్యంగా, అవలీలగా పూర్తి చేస్తున్నారు.


పిల్లర్లపైకి వరుసగా ఎత్తి పెట్టిన అతి బరువైన గడ్డర్లు


గడ్డర్లను ఫ్లైఓవర్ సమీపంలోకి తీసుకొస్తున్న ప్రత్యేక ట్రాలీ లారీ

మే నెలలో టీచర్ల బదిలీలు

● పారదర్శక నిర్వహణకు ప్రభుత్వం చర్యలు
● దివ్యాంగులు, వ్యాధి పీడితులకు సర్టిఫికెట్లు ● 26 వరకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు మే నెలలో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పారదర్శకంగా బదిలీలు నిర్వహించేందుకు టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-25 అమలులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభు త్వం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలో జరగనుంది. టీచర్ల బదిలీల్లో అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిపీడితులు, వారిపై ఆధారపడిన పిల్లలకు ముందుగానే అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించేందుకు చర్యలు చేపట్టింది. అక్రమాలకు తావు లేకుం డా కేవలం అర్హులైన వారికి మాత్రమే మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 24 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి బదిలీ కోసం దర ఖాస్తు చేసుకునే వారికి సర్టిఫికెట్లు జారీచేయాలని పాఠశాల విద్య కమి షనర్ విజయరామరాజు, వైద్యశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. కడప జిల్లాలోని టీచర్లందరు ప్రభు త్వ సర్వజన ఆసు పత్రి మెడికల్ క్యాంప్ నుంచి సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు చేశారు. గతంలో కేవలం 40శాతం వైకల్యం ఉన్న వారిని కూడా ప్రాధాన్యత కేటగిరీల్లో చేర్చడంతో కుప్పలు తెప్పలుగా సర్టిఫికెట్లు తెచ్చి బదిలీల్లో లబ్ధిపొందారు. ప్రస్తుతం తీవ్ర వైకల్యం ఉన్న వారినే ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించనున్నారు. 40శాతం నుంచి 55శాతం శారీరక వైకల్యం, దృష్టిలోపం, వినికిడిలోపం ఉన్న వారికి కూడా బదిలీల్లో ప్రత్యేక పాయింట్లను కేటాయిస్తారు.70 నుంచి 80శాతం వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీ టీచ ర్ల బదిలీల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. వీరికి వచ్చిన పాయింట్లతో సంబంధం లేకుండా బదిలీల్లో స్థానాలు కోరుకు నేందుకు ముందుగా అవకాశం ఇస్తారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రాధాన్యత కేటగిరీలో స్థానం పొందేం దుకు గతంలో కొందరు అడ్డదారుల్లో సర్టిఫికెట్లు తెచ్చుకొని లబ్ధిపొందారు. ప్రస్తుతం ఆ అక్రమాలకు చెక్ పెట్టి అర్హులైన దివ్యాంగులకు మేలు జరిగేలా తీవ్ర వైకల్యం ఉన్న వారిని మాత్రమే ప్రాధాన్యత కేటగిరీలో స్థానం కల్పిస్తున్నారు.

● 80 శాతం, 70శాతం అంతకంటే ఎక్కువ శారీరక వైకల్యం, దృష్టిలోపం ఉన్నవారు.
● క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవమార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్నవారు.
● స్పౌజ్ కాని, పిల్లలు కాని బుద్ధిమాంద్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నవారు. తలసేమియా, హీమోఫిలియా, మస్క్యులర్ డిస్ట్రోఫితో వైద్యం చేయించుకున్న పిల్లలు ఉన్నవారు. గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు ఉన్న టీచర్లను బది లీల్లో ప్రాధాన్యత కేటగిరీగా గుర్తిస్తారు. ఈ కేటగి రీలో బదిలీ కోరుకునే టీచర్లు ఇందుకు సంబం ధించిన సర్టిఫికెట్లు, గత మూడేళ్లకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వీరందరు ఈనెల 24 నుంచి 26 వరకు ఈ మూడు రోజుల్లోనే సర్టిఫికెట్లు పొందాలి. ఆర్‌జేడీలు, డీఈఓలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ మూడు రోజుల్లో సర్టిఫికెట్ల జారీకి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.



సర్టిఫికెట్ ఆధారంగానే వర్తింపు : డీఈఓ షంషుద్దీన్

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, పూర్వపు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులందరు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ స్పెషల్‌పాయింట్స్ పొందాల్సిన వారు తప్పని సరిగా మెడికల్ క్యాంప్ నకు హాజరు కావాలి. ఈ మేరకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జిల్లా ప్రభుత్వ సర్వజనుల ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఉంటుంది. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి సంబంధిత వైద్యులచే పరిశీలన చేయంచుకొని నూతన మెడికల్ సర్టిఫికెట్ తప్ప నిసరిగా పొందాలి. ఈ క్యాంప్ పొందిన సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ వర్తింపజేస్తారు.

పాపాఘ్నికి కృష్ణాజలాలు తీసుకొస్తాం

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



వేంపల్లెలో ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది వరకు పీబీసీ కాల్వ ద్వారా కృష్ణాజలాలను మరో పది పదైదు రోజుల్లోగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లె ప్రాంతంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని.. కృష్ణాజలాలు తీసుకొచ్చి సమస్య లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. వేంపల్లె పట్ట ణం పులివెందుల రోడ్డు టీడీపీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పా టు చేసిన ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను మండల పరిశీలకుడు రఘునాథరెడ్డితో కలిసి బీటెక్ రవి గురువారం ప్రారంభించారు. అనంత రం చింతలమడుగుపల్లె సమీపంలో నీరులేక ఎండిపోతున్న తమలపాకు తోటలను పరిశీలించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేశాం, నీళ్లు లేక తోటలు ఎండిపోతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులను యుద్ధ ప్రాతిపదికన నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రస్తుతం నియోజకవర్గంలో పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయన్నారు. వందల కోట్లు ఖర్చుపెట్టినా పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరించలేని దుస్థితి ఉందన్నారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, నామా వేమకుమార్, మండల ఉపాధ్యక్షుడు భద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు రీసర్వేపై ఉన్న అనుమానాలు నివృత్తి చేసుకోవాలి : ఆర్డీవో



శివాలపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన ఎలాంటి అను మానాలున్నా అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామ సచివాలయంలో రీసర్వేపై ఏర్పాటు చేసిన సమా వేశంలో రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు రీసర్వే పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి చిన్న సమస్యలున్నా తక్షణం రెవెన్యూ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. రైతుల మధ్య భూముల విస్తీర్ణంలో సెంటు, రెండు సెంట్లు లాంటి చిన్నపాటి తేడాలుంటే సర్దుబాటు చేసుకోవాలన్నారు. అలాగే భూములకు సంబంధించి ఇప్పటి వరకు 20 సమస్యలు వచ్చాయని, వాటిని తహసీల్దారు కార్యాలయంలో పరిష్కారం చేసుకొని ఖచ్చితమైన రికార్డులు పొందాలని సూచించారు. తహసీల్దారు సరస్వతి, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకట సుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు వెంకటశివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం రూపుమాపాలని ప్రతి ఇంటా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారైల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం వైఎస్సార్ కడప జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏదో ఒకరంగంలో నూతన పారిశ్రామిక వేత్తలుగా రాణించాల్సి ఉందన్నారు. జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నానని ఇందులో భాగంగా కడపకు వచ్చానన్నారు. ఈ జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు అవకాశాలు ఏమి ఉన్నాయి? ఎంఎస్ ఎంఈ పరిశ్రమలను ఎలా ప్రమోట్ చేయాలి? మహిళా సంఘాలు పారిశ్రామికంగా రాణించేందుకు ఉన్న అవకాశా లు, కొందరిలో ఉన్న అపోహల నివృత్తి తదితర అంశాలపై కలెక్టర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలసి సమీక్షించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించ నున్నామని అందులో భాగంగా కడపలో రెండు పార్కులు ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు స్థాపించిన వారందరికి రూ.1600కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అందులో ముఖ్యమంత్రి సబ్సిడీ కింద రూ.150కోట్లు విడుదల చేశారన్నారు. మీడియా సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులందరికీ పీఎంఎవీవై లబ్ధి చేకూరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన గర్భిణులందరికి ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం (పీఎంఎవీవై) ద్వారా లబ్ధి చేకూర్చేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా పీడీ జయంతితో కలిసి ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భందాల్చిన తొమ్మిది నెలల్లోపు ఈ పథకానికి రిజిస్టర్ చేసుకోవా లన్నారు. ఇందుకు మొదట ప్రసవానికి మొదటి విడతలో రూ.3000, రెండవ విడతలో రూ.2000 లబ్ధిదారు ఖాతాలో జమ చేస్తారన్నారు. ఇందుకోసం అంగన్వాడీ టీచర్ గర్భిణీ హెల్త్ కార్డు, ఆర్‌సీఎస్ ఐడీ, ఆధార్ వివరాలు అడ్రస్ మొద లైనవి తీసుకొని వారి పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. అక్కడ నుంచి సూపర్‌వైజర్ లాగిన్‌కు వెళ్తుంది. ఫీల్డ్ వెరిఫి కేషన్ చేసి తన లాగిన్‌లో అప్రూవ్ చేస్తారన్నారు. అక్కడ నుంచి సీడీపీఓ లాగిన్‌కు వెళ్తుందని వివరించారు. పీడీ డీటైల్స్ వెరిఫై చేసి జిల్లా లాగి న్‌కు సబ్మిట్ చేస్తారన్నారు. అక్కడ నుంచి స్టేట్ వెళ్లి అమౌంట్ పడుతుందని వివరించారు. అదేవిధంగా రెండవ కాన్పులో కూడా కేవలం ఆడపిల్ల పుడితే మాత్రం ఇదే పథకం అమలు అవుతుంది. మగపిల్ల వాడు పుడితే వర్తించదన్నారు. మొదటి కాన్పులో ఎవరు పుట్టినా ఈ పథకం వర్తిస్తుంద న్నారు. రెండవ కాన్పులో ఈ పథకం కింద రూ.6000 వేలు ఇస్తార న్నారు. కార్యక్రమంలో జజెండర్ స్పెషలిస్ట్, మిషన్ శక్తి స్కీం, హెల్త్ డిపార్ట్‌మెంట్ల రీసోర్స్ పర్సన్లు, రెండు జిల్లాల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని సీనియర్ అసిస్టెంట్‌లు, బీపీసీలు పాల్గొన్నారు.

ఆగిన పనులు పూర్తిచేయండి : ఎంపీ



రంగనాథస్వామి ఆలయం వద్ద కోనేరుకు పూజలు చేస్తున్న ఎంపీ

పులివెందుల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఆగిపోయిన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందుల రింగురోడ్డులో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో నూతనంగా రూ.68లక్షలతో ఏర్పాటు చేసిన కోనేరును ఆయన పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో వైసీపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. అందులో కొన్ని పూర్తికాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంలో విఫలమవుతోందన్నారు. బనానా ప్రాసెసింగ్ యూనిట్, గరండాల్ రివర్‌ఫ్రంట్, ఉలిమెల్ల లేక్, హాకీ స్టేడియం తదితర వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న జమ్మూ కాశ్మీర్‌ను తీవ్రవాదులు చొరవడి కాల్పులు జరపడం దురదృష్టకరన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇందుకు అందరి మద్దతు ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాళమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీత 'మూల'కు సత్కారం



మూలమల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న లక్షుమయ్య

కడప కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప సిద్ధార్థ ఇంగ్లీషు మీడియం స్కూలులో గురువారం కందుకూరి పురస్కార గ్రహీత ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ స్కూలు కరస్పాండెంట్ లక్షుమయ్య మాట్లాడుతూ సాహిత్య, నాటకరంగంలో బహుముఖ ప్రతి భను కనబరుస్తున్న మల్లికార్జునరెడ్డికి ప్రొద్దుటూరు చదువుల సాహిత్య కళా వేదిక వారు నటభూషణ బిరుదు, ఏపీ రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా కందుకూరి పుర స్కారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. మల్లికార్జునరెడ్డి గత 20 సంవత్సరాలుగా తనకు పరిచయమని.. ఏ పని అయినా నిబద్ధతతో చేస్తారన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌ను సత్కరించిన టీడీపీ నేత హరిప్రసాద్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎంఎస్ ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బి.హరిప్రసాద్ శాలువ కప్పి సత్కరించారు. గురువారం కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీడీపీ నేతలతో కలిసి పరిశ్రమల ఆవశ్యకతపై మంత్రితో చర్చించారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

కడపక్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం వద్ద బైకుపై వెళ్తున్న వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన ఎం.బాబ్జీ (37)పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి బైకులో వెళుతున్నాడు. అదే సమయంలో తుఫాన్ వాహనాన్ని బొలెరో వాహనానికి కట్టుకుని వస్తుండగా రామాంజనేయపురం వద్దకు రాగానే బొలెరో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబ్జీ మృతి చెందగా మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

దువ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ (48) అనే వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. ఇడమడకకు చెందిన రామకృష్ణ నాలుగు రోడ్ల రహదారి మీద వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు పంపి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడి మృతి

● గోప్యంగా ఉంచుతున్న నిర్వాహకులు



బాలుడి మృతదేహం

కడపక్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఓ స్విమ్మింగ్ పూల్‌లో గురువారం సాయంత్రం ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందాడు. కడప గంజికుంట కాలనీకి చెందిన బాలుడు ఈత కోసం మాచుపల్లె రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. అయితే అక్కడ పిల్లలకు ఒకటి, పెద్దలకు ఒకటి వేర్వేరు ఈత కొలనులు ఉన్నాయి. అయితే లోతు ఎక్కువ ఉండటం, బాలుడికి ఈత రాకపోవడంతో నిమిషాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. గమనించిన అక్కడి వారు కేకలు వేయడంతో నిర్వాహకులు వచ్చి స్విమ్మింగ్ పూల్ నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. ప్రథమ చికిత్స అందించినప్పటికీ బాలుడికి చలనం లేకపోవడంతో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఆ స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు టీడీపీ నేత కావడం... ఇటీవల ఆ స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. అయితే ఈ విషయాన్ని నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. చిన్నచౌకు పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం.

'టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించండి'

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో మరమ్మత్తులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డితో కలిసి టీటీడీ సభ్యుడికి వినతిపత్రం అందించారు. కల్యాణ మండపం తెరిపిస్తే పేద, మధ్యతరగతి వారు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గండి క్షేత్రాన్ని గతంలో టీటీడీలో విలీనం చేసుకున్నప్పుడు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నాటుసారా, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నగరిగుట్ట వీధుల్లో సిబ్బందితో పర్యటిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

పులివెందుల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని మత్తు పదార్థాల విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తెలవారుజామున నవోదయం 2.0 కార్యక్రమాన్ని నగరిగుట్టలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరిగుట్ట బి కేటగిరీ కింద ఉందన్నారు. రెండు నెలల్లో ఈ ప్రాంతాన్ని గ్రీన్ విలేజ్ - ఐడి ఫ్రీగా ప్రకటించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమ మద్యం విక్రయించే పాత నిందితులు మళ్లీ అక్రమ మద్యం కార్యకలాపాల్లో పాల్గొనవద్దని కఠినంగా హెచ్చరించామన్నారు. ప్రజల సహకారంతోనే నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరపున రుణాలు ఇప్పించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, పులివెందుల రూరల్ సీఐ రమణ, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకే రైల్వేకోడూరు రైల్వేస్టేషన్

● కరోనా తర్వాత ఆగని రైళ్లు ● ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రయాణం చేస్తున్న వైనం


రైల్వేకోడూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో రైల్వేస్టేషన్ పేరుకే ఉంది. కరోనా తర్వాత ఇక్కడ అనేక రైళ్లు ఆగడం లేదు. ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రయాణాలు చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. కరోనాకు ముందు అనేక రైళ్లు ఆగుతుండేవి. కరోనా తర్వాత చాలా రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..... ఓకా టూ రామేశ్వరం, హరిప్రియ, ఎల్‌టీటీ మధురై ఎక్స్‌ప్రెస్, సీఎస్ఎంటీ- చెన్నై, హుబ్లీ-చెన్నై, హమ్మాదాబాద్-చెన్నై, ఈక్తానగర్-చెన్నై, నిజాముద్దీన్-తిరుపతి, ఆడీ-టీపీటీవై, కేసీజీ-ముర్‌డర్, షోలాపూర్-టీపీటీవై, హుబ్లీ-తిరుపతి, నాగర్‌కోల్ ఎక్స్‌ప్రెస్, ఔరంగాబాద్-తిరుపతి, ఎల్‌టీటీ-కరికేకల్ తదితర రైళ్లు కరోనాకు ముందు ఆగుతుండేవి. కరోనా తర్వాత ఆగడం లేదు. ప్రస్తుతం రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వెంకట్రాద్రి, జయంతి, తిరుమల, అర్కోణం తదితర రైళ్లు ఆగుతున్నాయి. అయితే తిరుపతి, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఆగడం లేదు. దీంతో ప్రయాణికులు రేణిగుంట, కడప, గుంతకల్లు, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లి రైళ్లు ఎక్కి ప్రయాణించాల్సి వస్తోంది. తద్వారా అనేక వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. హరిప్రియ ఎక్స్‌ప్రెస్ మహారాష్ట్రలోని కోల్హాపూర్‌కు వెళుతుంది. కోల్హాపూర్‌లో లక్ష్మీదేవి శక్తిపీఠం ఉంది. ఇక్కడికి ప్రతిరోజు ప్రయాణికులు వెళుతుంటారు. కరోనాకు ముందు రైల్వేకోడూరులో ఆగేది. కరోనా తర్వాత ఆగడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో నాయకులు రైల్వే అధికారులతో పట్టుబట్టి అతి చిన్న



రైల్వేకోడూరు రైల్వేస్టేషన్

రైల్వేస్టేషన్ అయిన ఓబులవారిపల్లెలో ఆగేటట్లు చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇంతవరకు రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో ఆగని రైళ్ల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎక్కువగా తిరుపతి, కడప, రాజంపేట, గుత్తి, గుంతకల్లు, కర్నూలు, హైద్రాబాద్, చెన్నైకి ప్రయాణికులు వెళుతుంటారు. అలాగే కేరళ రాష్ట్రంలోని అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లాలంటే జయంతి తదితర రైళ్లను ఎక్కి వెళ్లాల్సి ఉంటుంది. సీజన్‌లో ఎక్కువ గా భక్తులు అక్కడికి వెళుతుంటారు. మధురైలో మధురమీనాక్షి ఉంది. అక్కడ రైలు ఆగడం లేదు. అలాగే అక్కడ కంటి ఆస్పత్రి ఉంది. నిత్యం రోగులు అక్కడికి వెళుతుంటారు. అలాంటి ప్రధానమైన రైళ్లను ఆపడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకుల నిర్లలక్ష్యంతో ఇక్కడ రైళ్లు ఆగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతి ప్రధాన నగరం. ఇక్కడ కలియుగదైవం వెంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇతర రాష్ట్రాలు, స్థానిక భక్తులు ఎక్కువ సంఖ్యలో వెళుతుంటారు. రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు బస్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీలో కేంద్ర ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంది. ఇక్కడి పాలకులు రైల్వేకోడూరు రైల్వే స్టేషన్‌లో రైళ్లను ఆపించలేని స్థితిలో ఉన్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ఆగని రైళ్లను ఆపించాలని విన్నవిస్తున్నారు.

కరోనా తర్వాత రైళ్లు ఆగడం లేదు



కరోనా తర్వాత చాలా రైళ్లు ఆగడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. చెన్నై నుంచి వచ్చే రైళ్లు రెండు రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. చెన్నైకి వెళ్లాలంటే ఆగడం లేదు. రేణిగుంట, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లి రైళ్లు ఎక్కే పరిస్థితి ఏర్పడింది. పాలకులు రైళ్లను ఆపిస్తే ప్రయాణికులకు ఆ వెతలు తీరుతుంది.

- హరిప్రసాద్, రైలు ప్రయాణికుడు, రైల్వేకోడూరు

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడం ఖాయం

● బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ముష్కరులు కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి పాకిస్తాన్‌కు భారతదేశం బుద్ధి చెప్పడం ఖాయమని బీజేపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి చిన్నిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ దుర్ఘటనలో 26 మంది పర్యాటకులు మృతి చెందారన్నారు. గురువారం రైల్వేకోడూరులో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన తదితర నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలి: భారతీయులపై ఉగ్రవాద మూర్ఖులు వేసిన


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

ఘాతుకం, హత్యంత హేయమైన చర్య అని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, బీజేపీ జిల్లా నాయకుడు ఆకేపాటి వెంకటరెడ్డి ఖండించారు. ఉగ్రదాడికి నిరసనగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

న్యాయమూర్తులు, న్యాయవాదుల నిరసన


బాధితులకు సంతాపం ప్రకటిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి, న్యాయవాదులు

రాయచోటిటౌన్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు గురువారం రాయచోటి కోర్టులో జిల్లా ఐదవ అదనపు జిడ్జి కృష్ణన్‌కుట్టి నేతృత్వంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం తెలియజేశారు. న్యాయమూర్తితో పాటు న్యాయవాదులందరూ కూడా రెండు నిమిషాలు మౌనం వహించి దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులైన 27 మందికి సంతాపాన్ని, అదేవిధంగా వారి కుటుంబ సభ్యులందరికీ సానుభూతిని తెలియజేశారు. రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, అడిషినల్ జ్యుడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తేజస్వినిలు ఆయా కోర్టు హాల్‌లో న్యాదువాదులతో కలిసి బాధితులకు సంతాపాన్ని ప్రకటించారు. రాయచోటి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎన్. ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డిబాషా, ఉపాధ్యక్షులు ధనుంజయకుమార్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ



ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమానత్ సేవా సొసైటీ అధ్యక్షుడు షేక్. అతావుల్లా ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నేతలు, మైనార్టీ నేతలు రాయచోటి పట్టణంలోని ఠానా సర్కిల్ నుండి నేతాజీ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

సంబేపల్లె, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు ర్యాలీ ఈవోపీఆర్‌డీ సురేశ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, వెలుగు సిబ్బందితో పాటు ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

సుండుపల్లెలో...

ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నేత రామజగదీశ్, టీడీపీ నాయకులు శివరాంనాయుడు, జనసేన మహిళా నేత రెడ్డిరాణి, రామా శ్రీనివాసులు పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

రావజాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామంలో ఎద్దుల మల్లయ్య పొలానికి దారి సమస్య పరిష్కారం చూపని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు మండల రెవెన్యూ అధికారికి సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాచపల్లి గ్రామం సర్వే నెంబర్ 19/10లో ఎద్దుల మల్లయ్య మరికొంత మంది రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండగా రోడ్డుకు మొదటి వరుసలో ఉన్న జబ్బార్ బాషాకు చెందిన డీకే టీ భూమి గుండా దారి ఉండేదని, ఆ దారి నుంచే ఇతర రైతులు తమ పొలాలకు వెళ్తుండేవారని తెలిపారు. జబ్బార్‌బాషా డీకేటీ భూమిని కొనుగోలు చేసిన పుల్లగూర రవిశంకర్ చుట్టూ పెన్సింగ్ వేసి రైతులకు దారి లేకుండా చేసినా రెవెన్యూ అధికారు పట్టించుకోలేదన్నారు. సీపీఎం శాఖా కార్యదర్శి నాగబసిరెడ్డి, ఈశ్వరయ్య, రైతులు నాగరాజు, మల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వైభవంగా గంగమ్మ జాతర

రాజంపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మన్నూరులో వెలసిన గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున పోతుల రాజు ఊరేగింపుగా గంగమ్మను తీసుకురాగా అమ్మవారికి మహిళలు తమ భక్తిని చాటుకున్నారు. తమ ఇంటి ముందుకు రాగానే సంప్రదాయబద్ధంగా ముద్దలు పెట్టుకుని జంతుబలులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గుడి లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. రాజంపేట చుట్టుపక్కల నుంచి భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు నేతలు, ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి జ్యోతిని చూడడానికి దారి పొడవునా జనం కిటకిటలాడారు. కాగా ఈ జాతర శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగుతుంది.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17వ మహా సభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దార్ల రాజశేఖర్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు పట్టణంలోని షిరిడీ సాయి జూనియర్ కళాశాలలో కరపత్రాలు విడుదల చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు శెట్టిపల్లె పెంచలయ్య, రవి, కిషోర్, గోపీ, రమణ, చరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయురాలు భారతి తల్లిదండ్రులను కోరారు. గురువారం బోయనపల్లె ప్రభుత్వ పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 600 మార్కులకు 590 మార్కులు తెచ్చుకుని మండల టాపర్‌గా నిలిచారని పేర్కొన్నారు. మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినితో కలిసి ఇంటింటికి వెళ్లి మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

సబ్‌స్టేషన్‌కు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రూపానందరెడ్డి

చిట్వేలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కె.కందులవారిపల్లెలో రూ.3.50 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి గురువారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటినుంచో కలగా మిగిలిపోయిన సబ్‌స్టేషన్ నిర్మాణం రూపుదాల్చుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, బాలురామాంజనేయులు, ఏదోటి రాజశేఖర్, గుత్తి నరసింహ, కాకర్ల నాగార్జుననాయుడు, శివరాజు, కట్టా బాలాజీ, మాదాసు నరసింహ, విద్యుత్ శాఖ ఏఈ చలపతిరావు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నందలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లతిమ్మాయగారిపల్లెలోని రాములవారి దేవస్థానంలో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. జడ్పీటీసీ సభ్యుడు గండికోట ఉషారాణి, గండికోట వెంకటసుబ్బారెడ్డి, ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏ ర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గీ తాల నరసింహారెడ్డి, నరసారెడ్డి, యానాదిరెడ్డి, రాజు, శ్రీనివాసులరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న తోట కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు దివంగత తోట ప్రభాకర్ పదోవ వర్థంతి సందర్భంగా గురువారం ఆయన కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తోట బాబు, తోట కళ్యాణ్, తోట తనుష్‌రాజ్, తోట సాయి, సునీల్, కృష్ణకుమార్, స్నేహితుడు ప్రదీప్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో రైల్వేకోడూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన చియ్యవరం గీతికకు 600 మార్కులకు గాను 587 మార్కులు సాధించిన విషయం తెలిసిందే. గురువారం రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి జోనల్ అధ్యక్షుడు మల్లెం హేమంత్‌కుమార్, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, పలు పాఠశాలల ఉపాధ్యాయులు గీతికను ఘనంగా సత్కరించి సీల్డ్ బహూకరించారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

సంబేపల్లె, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత సాధించాలని ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ ప్రతినిధి బీవీ రత్నం తెలిపారు. గురువారం దేవపట్ల ప్రైమరీ హెల్త్ సెంటర్ సమావేశ భవనంలో ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో డీఈఏ నిధులపై హెల్త్, ఆశావర్కర్లకు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలకు నామినీలు లేకపోవడం, ఖాతాలు ఉపయోగించకపోవడం, చనిపోయిన ఖాతాదారుల వారసులకు తెలియకపోవడం వంటి ఖాతాలతో పాటు పది సంవత్సరాలు పాటు ఖాతాలు లావాదేవాలు జరపకపోవడం వల్ల ఈ ఖాతా నిల్వలను డీఈఏ ఫండ్‌కు జమ అవుతాయన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.2.53 కోట్లతో కొత్త బోర్లు వేయించి కుళాయిల ద్వారా తాగునీటిని అందించామని, ఈ వేసవిలో గ్రామాల్లో ఎక్కడే గానీ తాగునీరు సమస్య తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు. రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు నియోజకవర్గాల్లోని ఈ ప్రాంతాల్లో వర్షపాతం చాలా తక్కువగా ఉందని, 1200 అడుగులు వేసినా నీటి జాడ కనిపించలేదన్నారు. ప్రతి గ్రామంలో 3 నుంచి 4 బోర్లు వేశామని, అందులో ఒక్క బోరులో నీరు పడితే మూడు బోర్లు పెయిల్ అవుతున్నాయన్నారు. తాగునీటి సమస్యతో 6 మండలాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అయినా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి ప్రజలకు తాగునీటి సమస్య తీరుస్తామన్నారు.తంబళ్లపల్లి, పుంగనూరు, పీలేరు, రాయచోటి ప్రాంతాలకు ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 22 కోట్ల రూపాయలతో టెండర్ పిలిచామని, నెల లోపు పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో 950 పల్లెలకు గానూ 750 పల్లెలకు జల్ జీవన్ పథకం ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

గ్రామీణులకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కమిటీ సభ్యులతో కలిసి ప్రమాణస్వీకారం చేశారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు వెంకట్రామరాజు, భాస్కర్‌రెడ్డి, రెడ్డెమ్మ, ఆసుపత్రి సూపరింటెంట్ నీలోఫర్‌బేగం, టీడీపీ మండల యువజన నాయకులు యనమల మదన్‌మోహన్, ఏఐసీసీ మాజీ చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రెడ్డెయ్య, షేక్. ఆరీఫ్, సిద్దక వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆనందం

మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆనందం

వెల్లువిరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. గురువారం ఆయన లక్కిరెడ్డిపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చే జూన్ మాసంలో ప్రతి బడిలోనూ ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తామన్నారు. నాణ్యమైన యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందిస్తామన్నారు.

అర్హులైన సోలార్ బాధితులకు న్యాయం చేస్తాం

గాలివీడు, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): తూముకుంట పంచాయతీలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ వల్ల భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన గుండ్లచెరువు పంచాయతీలోని పసుపులవాండ్లపల్లెలో పర్యటించారు. ఆ గ్రామానికి చెందిన వీరరాఘవులు, నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేస్తానన్నారు. మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రాజు, మహమ్మద్‌రియాజ్, భద్రప్పనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేడెం లక్ష్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపాలి

చిన్నమండెం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): అర్జీదారులకు అధికారులు సత్వర పరిష్కారం చూపాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో తమ నివాసంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ ఒక్కరూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశ్యంతో ప్రజా సమస్యలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

30లోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30లోపు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని తహశీల్దార్ మహబుబ్ చాంద్ తెలిపారు. రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒకరు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ లేని పక్షంలో రేషన్ సరుకులు అందవని హెచ్చారించారు. రేషన్ దుకాణాల వద్ద ప్రతి రోజు డీలర్లు ఈ-కేవైసీ చేస్తున్నారని తెలిపారు. రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ నమోదు వివరాలు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్ సీఎస్‌డీటీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుల్లంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ రహదారులు తదితర వాటిపై సమీక్ష జరుగుతుందన్నారు. కావున ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

జాతీయ సదస్సులో అన్నమాచార్య విద్యార్థుల ప్రతిభ

రాజంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మదనపల్లె మిట్స్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులో అన్నమాచార్య విద్యార్థులు ప్రతిభ చాటారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఈఈఈ విభాగం విద్యార్థులను బి.కీర్తి, ఎ.హర్షవీణలు, టెక్నికల్ సింపోజియం, ఏరా 2కె 25 ప్రాజెక్టు ఎక్స్‌పో పేపర్ ప్రెజంటేసన్ ప్రదర్శించి రెండు జాతీయ సదస్సుల్లో విజయం సాధించి తమ ప్రతిభను కనబరచి మొదటి బహుమతి దక్కించుకున్నారు. అదేవిధంగా కడప కేఎస్ఆర్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించి జాతీయ సాంకేతిక సదస్సులో పాల్గొని ప్రతిభను కనబరచి మొదటి బహుమతిని గెలుచుకుని విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంపొందించారు.

జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అన్నమాచార్య యూనివర్సిటీ ప్రోచాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్‌మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలితలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థుల కృషి, నైపుణ్యం, పట్టుదలకు ప్రతిబింబమన్నారు. ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయుక్తంగా ఉంటాయని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

పెనగలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఈటమాపురం రైతుసేవా కేంద్ర పరిధిలోని రైతులకు మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభూసార పరీక్షలు చేయించుకుంటే ఎంత మోతాదులో ఎరువులు వాడాలి, ఏయే మందులు వాడాలి అనే విషయం తెలుస్తుందన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట పంచాయతిలోని పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీపీవో కార్యాలయ ఏవో ఖాదర్ బాషా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ సిబ్బందికి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఉపసర్పంచ్ భారతి, పంచాయతి సభ్యులు అనంతయ్య చెరవు సంఘం వైస్ చైర్మన్ కట్ట యానాదయ్య పాల్గొన్నారు.

సుండుపల్లెలో

ఘరానా మోసం


సుండుపల్లెలో దొంగ పాసుపుస్తకాల గుట్టు రట్టయింది. ఒక్కో పాసుపుస్తకానికి రైతుల వద్ద నుంచి వేలు, లక్షల్లో వసూళ్లకు పాల్పడినట్లు ఓ రైతు ఫిర్యాదుతో వెలుగు చూసింది. మండలానికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయంలో తిరుగుతూ గతంలో సుండుపల్లెలో అటెండర్‌గా పనిచేసిన తన భార్య ఉద్యోగాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. ప్రస్తుతం అతడి భార్య ఇక్కడ పనిచేయకపోయినా అక్రమ పాసుపుస్తకాలు, దొంగ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట సాక్ష్యాలతో సహా వెలుగులోకి రావడంతో మండలంలో ఆ వ్యక్తిని నమ్మి మోసపోయిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

- అక్రమ పాసుపుస్తకాల పేరిట బురిడీ
- అధికార ముద్ర, సంతకాలు ఫోర్జరీ
- రైతుల నుంచి లక్షల్లో వసూళ్లు
- పోలీసులకు ఓ రైతు ఫిర్యాదు


బాధిత రైతు అన్నారపు నారాయణ

సుండుపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీ జేసీ కురవపల్లికి చెందిన అన్నారపు నారాయణ అనే రైతును పూజారి నాగన్న అనే వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని నెలల క్రితం.. 'నీకు స్థలం ఉంది కదా.. నువ్వు ఇలాగే ఉంటే ఎలా? నాతో మాట్లాడు.. మా సార్‌తో మాట్లాడి పట్టా చేయిస్తా'నని చెప్పారని తెలిపారు. ఆ తర్వాత నెల రోజుల తర్వాత ఫోన్ చేసి పట్టా చేయిస్తానని రూ.50 వేలు తీసుకుని మోసం చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను తన భార్య కేరళలో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నావని, రూ.50 వేలు సంపాదించాలంటే సుమారు మూడు నెలలు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. డబ్బులు తీసుకోవడంతో పాటు దొంగ పాసుపుస్తకం జారీ చేసి తమ కడుపు కొట్టారని వాపోయాడు. మోసపోయిన విషయం తెలుసుకుని పూజారి నాగన్నకు ఫోన్ చేస్తే బెదిరిస్తున్నాడని, సుండుపల్లె ఎస్ఐ, తహసీల్దార్‌లు తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ అక్రమ పాసుపుస్తకాల జారీ వెనుక ఒకరిద్దరు వీఆర్‌వోల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.


దొంగ పాసుపుస్తకం సిద్ధం చేసిన దృశ్యం


పాసుపుస్తకంలో ఫోర్జరీ సంతకాలు, ఫోర్జరీ అధికార ముద్ర

పెద్ద సంఖ్యలో అక్రమ పట్టాలు జారీ

మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలకు గిరాకీ ఉండడంతో ఇంటి పట్టాల నుంచి పాసుపుస్తకాల వరకు పెద్ద మొత్తంలో నగదు చేతులు మారి అక్రమ పట్టాలు వెలుగు చూసినట్లు సమాచారం. గత ఐదు సంవత్సరాల్లో వందల సంఖ్యలో జగనన్న కాలనీలకు, ఇతర విలువైన ప్రభుత్వ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ అయ్యాయి. ఇవన్నీ ప్రస్తుతం నిర్మాణాలు, అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రెవెన్యూ అధికారులే అని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా అక్రమ పాసుపుస్తకాలకు సంబంధించి ఓ వ్యక్తి డబ్బు తీసుకుని మోసం చేసినట్లు రైతు తమకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు.

మాన్యువల్ పాస్ పుస్తకాల జారీ జరగలేదు

తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎటువంటి పాసుపుస్తకాలు జారీ కాలేదు. 2015 సంవత్సరం తరువాత మాన్యువల్ పాసుపుస్తకాల జారీని ప్రభుత్వం నిలిపివేసింది. ఆ పాసుపుస్తకాలు జారీ చేసిన వ్యక్తికి, తహసీల్దార్ కార్యాలయానికి సంబంధం లేదు.

- దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె

రంగసముద్రం చెరువులో

అక్రమంగా చేపలవేట

- వేలం నిర్వహించని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి


చేపల వేట కోసం చెరువు వద్ద ఏర్పాట్లు చేసుకున్న జాలర్లు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద చెరువుల్లో ఒక్కటైన రంగసముద్రం చెరువులో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా చేపలు పట్టుకునేందుకు జాలర్లను దింపారు. రంగసముద్రం చెరువులో చేపల వేట వేలం ద్వారా గత ఆర్థిక సంవత్సరానికి రూ.17 లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. అయితే ఆ గడువు ముగియడంతో మళ్లీ వేలం పాటలకు అధికారులు నిర్ణయించారు. అయితే చెరువు మాకే కావాలని అప్పటి వైసీపీ మద్దతుదారులైన పాత వేలం పాటదారులు అధికారులతో కుమ్మక్కై వారికే వేలం దక్కేలా చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఆయకట్టుదారులు, గ్రామస్థులు అధికారుల తీరును ఎండగట్టి వేలం పాటలను రద్దు చేయించారు. బహిరంగ ప్రకటన ఇచ్చి వేలం పాటలను నిర్వహించాలని కోరారు. మళ్లీ నెల రోజుల క్రితం రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చి వేలం పాటలు నిర్వహించడానికి పంచాయతీ అధికారులు సమాయత్తమయ్యారు. ఇందులో కూడా గోల్‌మాల్ జరుగుతోందని గ్రహించిన గ్రామస్థులు దానిని కూడా అడ్డుకున్నారు. ఈసారి పారదర్శకంగా వేలం పాటలు నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వేలం పాటలు నిర్వహించలేదు. వేలం పాట నిర్వహిస్తే దాదాపు రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే పాత వేలం పాటదారులు చెరువులో చేపలను పట్టడానికి జాలర్లను దింపడంతో గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే వేలం పాటలను నిర్వహించాలని కోరుతున్నారు. అక్రమంగా చేపలు పడుతున్న వారిని అడ్డుకుంటామని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్‌ను వివరణ కోరగా చెరువు వేలం వివాదం కోర్టులో ఉందని, బహిరంగ వేలం త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాట నిర్వహించే వరకు ఎవరూ చెరువులో చేపలు పట్టకూడదని, అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రిటైర్డు ఎస్ఈ పెన్షన్‌లో 10 శాతం కోత

కలికిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పనిచేసి శ్రీకాకుళంలో పదవీ విరమణ చేసిన బి.ఎన్.శ్రీనివాసులు నెలవారీ పెన్షన్‌లో 10 శాతం శాశ్వత కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన కడపలో పనిచేసే కాలంలో 2015లో తాగునీటి సరఫరా శాఖ కు అవసరమయ్యే పైపులు, ఇతర పరికరాలు సరఫరా చేయడానికి నిబంధనలకు విరుద్ధంగా అత్యధికంగా ధరలు పెంచి కొనుగోలుకు అనుమతించినట్లు ప్రధాన అభియోగం. ఇందులో ఎస్ఈ శ్రీనివాసులు అనేక అక్రమాలకు పాల్పడ్డట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు నిగ్గు తేల్చింది. విజిలెన్స్ నివేదికపైన ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.రాజేశ్వర రావు విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. అనంతరం శ్రీనివాసులు వైపు నుంచి అందిన సంజాయిషీలను పరిశీలించి మరో ఇంజనీర్ ఇన్ చీఫ్-3 కె.కిశోర్‌కుమార్‌కు విచారణను అప్పగించారు.

ఆ తరువాత మరో ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు పి.సంజీవరెడ్డి, టి.గాయత్రీదేవిలను విచారణాధికారులుగా నియమించారు. అన్ని విచారణల్లోనూ అక్రమాలు రుజువైనట్లు తేలడంతో చివరగా ఎస్ఈ శ్రీనివాసులు వాదనలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అయితే శ్రీనివాసులు సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో చివరకు ఆయన పెన్షన్‌లో శాశ్వతంగా 10 శాతం కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

స్థానిక జాతి చెట్లను అభివృద్ధి చేయాలి : డీఎఫ్‌వో


కార్యక్రమంలో మాట్లాడుతున్న కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్

కడప ఎన్జీఆర్ సర్కిల్/సిద్దవటం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతి చెట్లను అటవీ ప్రాంతాల్లో ఇతర ప్రదేశాల్లో అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని జిల్లా అటవీ అధికారి వినీత్ తెలిపారు. కడప స్థానిక అటవీ పునరుద్ధరణ ప్రాజెక్టు ప్రారంభం కార్యక్రమాన్ని వైఎస్సార్ అటవీ విభాగం ఆధ్వర్యంలో రాజీవ్ స్మృతివనంలో గురువారం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని డీఎఫ్‌వో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవి జంతువుల రక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. అటవీ సంరక్షణలో భాగంగా నర్సరీలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. వర్మీకంపోస్టు తయారీ విధానం కూడా ప్రజలకు వివరించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు అటవీ శాఖ సిబ్బంది తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

కార్యక్రమంలో కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్, కడప డ్వామా ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీవోలు, సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, అటవీశాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

తీర్థయాత్రకు వెళ్లి ఆర్టీసీ డ్రైవర్ మృతి


భాస్కరశెట్టి (ఫైల్)

పీలేరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులతో సహా తీర్థయాత్రలకు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ మరణించిన సంఘటన గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన దేవతి భాస్కరశెట్టి (52) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ముషీరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 21న కోటప్పకొండ, మంగళగిరి, అమరావతి, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రకు వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం అన్నవరం ఆలయ దర్శనానంతరం లాడ్జీలోని రూము ఖాళీ చేసి వస్తుండగా కాలు జారి మెట్ల మీద నుంచి జారిపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నందలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రచెరువుపల్లెలో గత యేడాది జరిగిన హత్యకేసులో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఆయన కథనం మేరకు... సత్తుపల్లె వెంకటరెడ్డి ఆదే గ్రామానికి చెందిన నాగప్రతాప్‌రెడ్డిల మధ్య కోడిపుంజు విషయమై 2024లో జూలై 27న గొడవ జరిగింది. వెంకటరెడ్డి నాగప్రతాప్‌రెడ్డిని అసభ్యకరంగా తిట్టగా నాగప్రతాప్‌రెడ్డిని అతడి ఇంటిలోనికి తీసుకెళ్లి మచ్చుకత్తితో తలమీద నరికాడు. మరుసటిరోజు వెంకటరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగప్రతాప్‌రెడ్డి అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. నందలూరు పోలీసుస్టేషన్‌లో క్రైం నంబరు 99/2024యు/ఎస్103(1) హత్య కేసులోని నిందితుడి గురించి వచ్చిన సమాచారం మేరకు రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ నందలూరు సిబ్బందితో నాగిరెడ్డిపల్లె గ్రామంలోని పాత ఆర్‌అండ్‌బీ బంగ్లా దగ్గర నిందితుడు నాగప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన మచ్చుకత్తిని స్వాధీనపరుచుకుని రిమాండ్‌కు పంపించామన్నారు. కాగా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు పోలీసుస్టేషన్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

అక్రమాస్తుల కేసు నుంచి ఏఎస్‌వోకు విముక్తి

కలికిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసరు (ఏఎస్ఓ)గా పనిచేసి పదవీ విరమణ చేసిన చింతపల్లి గోవిందరాజులుకు అక్రమాస్తుల కేసు నుంచి పదేళ్ల తరువాత విముక్తి కలిగిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2015లో గోవిందరాజులు అక్రమాస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం గోవిందరాజులుపై ప్రాసిక్యూషన్ చర్యలకు ప్రభుత్వం 2017 ఏప్రిల్ 24 ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ప్రాసిక్యూషన్ ఆదేశాలపై గోవిందరాజులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు ప్రభుత్వ ప్రాసిక్యూషన్ ఆదేశాలను కొట్టేస్తూ గోవిందరాజులుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై ప్రభుత్వం హైకోర్టులోనే అప్పీల్ పిటీషన్ దాఖలు చేసింది.

ఈలోగా హైకోర్టు తీర్పు మేరకు అక్రమాస్తుల కేసు నుంచి తనకు విముక్తి కలిగించాలని ప్రభుత్వానికి విన్నవించారు. అయితే తీర్పు వెలువడిన తరువాత అప్పీలు పిటీషన్ దాఖలు చేసే వ్యవధికి సంబంధించి సాంకేతికపరమైన సమస్య రావడంతో చివరకు తన అప్పీలు పిటీషన్ ఉపసంహరించుకోవాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు సూచిస్తూ ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో గోవిందరాజులుపై నమోదైన అక్రమాస్తుల కేసులో ఆయనకు ప్రాసిక్యూషన్ నుంచి విముక్తి లభించినట్లయ్యింది.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా


రాయచోటిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా గురువారం రాయచోటి, మదనపల్లె, రాజంపేట సబ్ డివిజన్ల పరిధిలో పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రాయచోటిలో అర్బన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 మోటారు సైకిల్స్, 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 27 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల నాకాబందీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలపై ఈ చలానాలు నమోదు చేసి ఒక లక్షా 9 వేల 9 వందల 75 రూపాయలు జరిమానా విధించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. రాత్రి సమయాల్లో చిన్నచిన్న సంఘటనలు పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతుందన్నారు.

వీఆర్‌వోపై దాడి ఘటనలో డీఎస్పీ విచారణ


తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

గాలివీడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పందికుంట వీఆర్‌వో జయన్నపై జరిగిన దాడి ఘటనలో రాయచోటి డీఎస్పీ ఎస్.మహేంద్ర విచారణ చేపట్టారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహసీల్దార్ భాగ్యలత, సిబ్బందితో సమావేశమై దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత వీఆర్‌వోతో కలిసి దాడి జరిగిన ప్రదేశంలో దాడి ఎలా జరిగిందన్న విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఈ దాడి ఘటనలో సాక్షులుగా ఉన్న సిబ్బందిని వేర్వేరుగా ఒక్కొక్కరిని విచారించి సమాచారం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో నిందితులుగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ హేమసుందర్‌రెడ్డి ఆయన తండ్రి రామచంద్రారెడ్డిపై ఇది వరకే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్ఐ రామక్రిష్ణ, ఆర్ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బాహుబలి' యంత్రాలు

- 95 టన్నుల గడ్డర్లను అవలీలగా ఎత్తేసిన క్రేన్లు
- ఫ్లైఓవర్ నిర్మాణాల్లో కీలకంగా మారిన క్రేన్లు



పిల్లర్లపై గడ్డర్‌ను ఎత్తి పెడుతున్న క్రేన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఐదు టన్నుల బరువుండే లాకర్లను ఏదైనా ఎత్తయిన భవనాల పైకి ఎత్తాలంటేనే క్రేన్ల సహాయంతో ఆపసోపాలు పడాల్సి ఉంటుంది. అలాంటిది 95 టన్నుల గడ్డర్లను 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదికి చేర్చాలంటే ఇంకెంత పెద్ద క్రేన్లు అవసరమో తెలుస్తుంది. మదనపల్లె మండలం ఆరోగ్యవరం దిగువన నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద అలాంటి బాహుబలి క్రేన్లు రెండు చూపరులను ఆశ్చర్యానికి గురి చేశాయి. మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎన్‌హెచ్-71 కింద తిరుపతి-మదనపల్లె ట్రంకు రోడ్డు క్రాసింగ్ అవుతోంది. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి నాలుగు పిల్లర్లను కూడా సిద్ధం చేశారు. సుమారు నాలుగు నెలలుగా ఈ పిల్లర్ల సమీపంలోనే ఎనిమిది గడ్డర్లను కాంట్రాక్టు సంస్థ ఆర్‌సీసీ ద్వారా తయారు చేసింది. ఒక్కో గడ్డర్ సుమారు 95 టన్నుల దాకా బరువు ఉంటుంది. ఇలాంటి గడ్డర్లను ఎనిమిందిటిని పిల్లర్ల పైకి ఎత్తేంతుకు ప్రత్యేక క్రేన్లను తెప్పించారు.

బాహుబలి క్రేన్లు

ఎన్‌హెచ్-71 నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రత్యేకంగా రూ.8 కోట్లు పెట్టి అత్యాధునికంగా పనిచేసే రెండు బాహుబలి క్రేన్లను కొనుగోలు చేశారు. ఈ క్రేన్లు అంతా ఎలక్ట్రానిక్ పద్ధతులతో, సెన్సార్లతో అతి బలమైన ఉక్కు తీగలు, క్రేన్లతో తయారు చేశారు. ఒక్కో క్రేన్ గరిష్ఠంగా ఎత్తే బరువు 48 టన్నులు కాగా, రెండు క్రేన్ల సహాయంతో ఒక్కో గడ్డర్‌ను ఎత్తి పిల్లర్లపై పెడుతున్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాటు, తప్పు జరిగినా కోట్ల విలువైన యంత్రాలు పాడవటంతో పాటు, విలువైన కార్మికుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో నిష్ణాతులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో గడ్డర్లను భారీ ట్రాలీ లారీల్లో ఎక్కించి పక్కనే వున్న పిల్లర్ల వద్దకు ఇంచి, ఇంచి జరుపుకుంటూ వచ్చారు. ఒక గడ్డర్‌ను రెండు చివర్లా రెండు క్రేన్లు సమానంగా ఉక్కుతీగలతో కట్టి అర అడుగు చొప్పున, రెండు వైపులా ఒకే ఎత్తులో ఉండేలా పైకి ఎత్తారు. ఇలా 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదకు ఒక్కో గడ్డర్‌ను ఎక్కించేందుకు రెండు గంటల సమయం పట్టింది. ఇలా ఎనిమిది గడ్డర్లను ఎత్తేందుకు ఇంజనీర్లు రెండు రోజుల సమయం తీసుకున్నారు.

ఫ్లైఓవర్ల నిర్మాణంలో కీలకం

మదనపల్లె నుంచి పీలేరు వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల రహదారి మార్గంలో పలుచోట్ల రోడ్ల క్రాసింగ్‌లు, చెరువు, నదులు ఉండటంతో ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను డిజైన్ చేసి నిర్మించారు. 52 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై సుమారు 30 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. సిమెంటు గడ్డర్లతో పిల్లర్లపైన నిర్మించే బ్రిడ్జిలు (ఫ్లైఓవర్లు) ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కో గడ్డర్ ఎంత లేదన్నా 95 టన్నుల బరువు ఉంటుంది. వీటిని ఎత్తి పిల్లర్లపైకి పెట్టేందుకు నిర్మాణ సంస్థ రూ.8 కోట్లతో రెండు బాహుబలి క్రేన్లను తెప్పించడంతో ఇవే కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో నిర్మాణంలో ఫ్లైఓవర్లను చాకచక్యంగా, అవలీలగా పూర్తి చేస్తున్నారు.


పిల్లర్లపైకి వరుసగా ఎత్తి పెట్టిన అతి బరువైన గడ్డర్లు


గడ్డర్లను ఫ్లైఓవర్ సమీపంలోకి తీసుకొస్తున్న ప్రత్యేక ట్రాలీ లారీ

మే నెలలో టీచర్ల బదిలీలు

● పారదర్శక నిర్వహణకు ప్రభుత్వం చర్యలు

● దివ్యాంగులు, వ్యాధి పీడితులకు సర్టిఫికెట్లు ● 26 వరకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు మే నెలలో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పారదర్శకంగా బదిలీలు నిర్వహించేందుకు టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-25 అమలులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభు త్వం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలో జరగనుంది. టీచర్ల బదిలీల్లో అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిపీడితులు, వారిపై ఆధారపడిన పిల్లలకు ముందుగానే అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించేందుకు చర్యలు చేపట్టింది. అక్రమాలకు తావు లేకుం డా కేవలం అర్హులైన వారికి మాత్రమే మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 24 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి బదిలీ కోసం దర ఖాస్తు చేసుకునే వారికి సర్టిఫికేట్లు జారీచేయాలని పాఠశాల విద్య కమి షనర్ విజయరామరాజు, వైద్యశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. కడప జిల్లాలోని టీచర్లందరు ప్రభు త్వ సర్వజన ఆసు పత్రి మెడికల్ క్యాంప్ నుంచి సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు చేశారు. గతంలో కేవలం 40శాతం వైకల్యం ఉన్న వారిని కూడా ప్రాధాన్యత కేటగిరీల్లో చేర్చడంతో కుప్పలు తెప్పలుగా సర్టిఫికెట్లు తెచ్చి బదిలీల్లో లబ్ధిపొందారు. ప్రస్తుతం తీవ్ర వైకల్యం ఉన్న వారినే ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించనున్నారు. 40శాతం నుంచి 55శాతం శారీరక వైకల్యం, దృష్టిలోపం, వినికిడిలోపం ఉన్న వారికి కూడా బదిలీల్లో ప్రత్యేక పాయింట్లను కేటాయిస్తారు.70 నుంచి 80శాతం వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీ టీచ ర్ల బదిలీల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. వీరికి వచ్చిన పాయింట్లతో సంబంధం లేకుండా బదిలీల్లో స్థానాలు కోరుకు నేందుకు ముందుగా అవకాశం ఇస్తారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రాధాన్యత కేటగిరీలో స్థానం పొందేం దుకు గతంలో కొందరు అడ్డదారుల్లో సర్టిఫికెట్లు తెచ్చుకొని లబ్ధిపొందారు. ప్రస్తుతం ఆ అక్రమాలకు చెక్ పెట్టి అర్హులైన దివ్యాంగులకు మేలు జరిగేలా తీవ్ర వైకల్యం ఉన్న వారిని మాత్రమే ప్రాధాన్యత కేటగిరీలో స్థానం కల్పిస్తున్నారు.

● 80 శాతం, 70శాతం అంతకంటే ఎక్కువ శారీరక వైకల్యం, దృష్టిలోపం ఉన్నవారు.

● క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవమార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్నవారు.

● స్పౌజ్ కాని, పిల్లలు కాని బుద్ధిమాంద్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నవారు. తలసేమియా, హీమోఫిలియా, మస్క్యూలర్ డిస్ట్రోఫితో వైద్యం చేయించుకున్న పిల్లలు ఉన్నవారు. గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు ఉన్న టీచర్లను బది లీల్లో ప్రాధాన్యత కేటగిరీగా గుర్తిస్తారు. ఈ కేటగి రీలో బదిలీ కోరుకునే టీచర్లు ఇందుకు సంబం ధించిన సర్టిఫికెట్లు, గత మూడేళ్లకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వీరందరు ఈనెల 24 నుంచి 26 వరకు ఈ మూడు రోజుల్లోనే సర్టిఫికెట్లు పొందాలి. ఆర్జేడీలు, డీఈఓలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ మూడు రోజుల్లో సర్టిఫికెట్ల జారీకి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.



సర్టిఫికెట్ ఆధారంగానే వర్తింపు : డీఈఓ షంషుద్దీన్

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, పూర్వపు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులందరు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ స్పెషల్‌పాయింట్స్ పొందాల్సిన వారు తప్పని సరిగా మెడికల్ క్యాంప్ నకు హాజరు కావాలి. ఈ మేరకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జిల్లా ప్రభుత్వ సర్వజనుల ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఉంటుంది. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి సంబంధిత వైద్యులచే పరిశీలన చేయంచుకొని నూతన మెడికల్ సర్టిఫికెట్ తప్ప నిసరిగా పొందాలి. ఈ క్యాంప్ పొందిన సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ వర్తింపజేస్తారు.

పాపాఘ్నికి కృష్ణాజలాలు తీసుకొస్తాం

● పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



వేంపల్లెలో ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది వరకు పీబీసీ కాల్వ ద్వారా కృష్ణాజలాలను మరో పది పదైదు రోజుల్లోగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లె ప్రాంతంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని.. కృష్ణా జలాలు తీసుకొచ్చి సమస్య లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. వేంపల్లె పట్ట ణం పులివెందుల రోడ్డు టీడీపీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పా టు చేసిన ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను మండల పరిశీలకుడు రఘునాథరెడ్డితో కలిసి బీటెక్ రవి గురువారం ప్రారంభించారు. అనంత రం చింతలమడుగుపల్లె సమీపంలో నీరులేక ఎండిపోతున్న తమలపాకు తోటలను పరిశీలించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేశాం, నీళ్ల లేక తోటలు ఎండిపోతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులను యుద్ధ ప్రాతిపదికన నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రస్తుతం నియోజకవర్గంలో పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయన్నారు. వందల కోట్లు ఖర్చుపెట్టినా పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరించలేని దుస్థితి ఉందన్నారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, నామా వేమకుమార్, మండల ఉపాధ్యక్షుడు భద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు రీసర్వేపై ఉన్న అనుమానాలు నివృత్తి చేసుకోవాలి : ఆర్డీవో



శివాలపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన ఎలాంటి అను మానాలున్నా అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామ సచివాలయంలో రీసర్వేపై ఏర్పాటు చేసిన సమా వేశంలో రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు రీసర్వే పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి చిన్న సమస్యలున్నా తక్షణం రెవెన్యూ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. రైతుల మధ్య భూముల విస్తీర్ణంలో సెంటు, రెండు సెంట్లు లాంటి చిన్నపాటి తేడాలుంటే సర్దుబాటు చేసుకోవాలన్నారు. అలాగే భూములకు సంబంధించి ఇప్పటి వరకు 20 సమస్యలు వచ్చాయని, వాటిని తహసీల్దారు కార్యాలయంలో పరిష్కారం చేసుకొని ఖచ్చితమైన రికార్డులు పొందాలని సూచించారు. తహసీల్దారు సరస్వతి, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకట సుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు వెంకటశివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం రూపుమాపాలని ప్రతి ఇంటా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారైల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం వైఎస్సార్ కడప జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏదో ఒకరంగంలో నూతన పారిశ్రామిక వేత్తలుగా రాణించాల్సి ఉందన్నారు. జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నానని ఇందులో భాగంగా కడపకు వచ్చానన్నారు. ఈ జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు అవకాశాలు ఏమి ఉన్నాయి? ఎంఎస్ ఎంఈ పరిశ్రమలను ఎలా ప్రమోట్ చేయాలి? మహిళా సంఘాలు పారిశ్రామికంగా రాణించేందుకు ఉన్న అవకాశా లు, కొందరిలో ఉన్న అపోహల నివృత్తి తదితర అంశాలపై కలెక్టర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలసి సమీక్షించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించ నున్నామని అందులో భాగంగా కడపలో రెండు పార్కులు ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు స్థాపించిన వారందరికి రూ.1600కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అందులో ముఖ్యమంత్రి సబ్సిడీ కింద రూ.150కోట్లు విడుదల చేశారన్నారు. మీడియా సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆగిన పనులు పూర్తిచేయండి : ఎంపీ



రంగనాథస్వామి ఆలయం వద్ద కోనేరుకు పూజలు చేస్తున్న ఎంపీ

పులివెందుల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఆగిపోయిన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందుల రింగురోడ్డులో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో నూతనంగా రూ.68లక్షలతో ఏర్పాటు చేసిన కోనేరును ఆయన పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో వైసీపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. అందులో కొన్ని పూర్తికాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంలో విఫలమవుతోందన్నారు. బనానా ప్రాసెసింగ్ యూనిట్, గరండాల్ రివర్‌ఫ్రంట్, ఉలిమెల్ల లేక్, హాకీ స్టేడియం తదితర వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న జమ్మూ కాశ్మీర్‌ను తీవ్రవాదులు చొరవడి కాల్పులు జరపడం దురదృష్టకరన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇందుకు అందరి మద్దతు ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాళమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.9.50లక్షలు ఆదాయం

రాజుపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన సోమేశ్వరస్వామి దేవాలయం భూముల కౌలు వేలం ద్వారా రూ.9.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కె.రామచంద్రచార్యులు తెలిపారు. గురువారం సదరు ఆలయ మండపం లోని బహిరంగ వేలం పాట నిర్వహించారు. టంగుటూరు గ్రామ పొలంలోని 178.59 ఎకరాలు భూమికి ఒక ఏడాది పాటు కౌలు సాగు చేసుకునేందుకు వేలం పాట నిర్వహించారు. దేవదాయశాఖ ప్రొద్దుటూరు డివిజను ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ వేలం పాట జరిగింది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సహకారంతో గ్రామంలోని వేలం పాట నిర్వహించడంతో గత ఏడాది రూ.8.50లక్షలు, ఈ సంవత్సరం రూ.9.50లక్షలు ఆదాయం వచ్చినట్లు చర్చించుకుంటున్నారు. గతంలో వేలం పాట ప్రొద్దుటూరులో నిర్వహించేంటప్పుడు రూ.4లక్షల కంటే మించకుండా ఆదాయం వచ్చేది. ఈ వేలంపాటలో దాదాపు 56 మంది పాటదారులు ఒక్కొక్కరు రూ.10వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనగా 35 మంది పాటదారు లు ఈభూములు కౌలుకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ రంగేశ్‌రెడ్డి, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీత 'మూల'కు సత్కారం



మూలమల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న లక్షుమయ్య

కడప కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప సిద్దార్థ ఇంగ్లీషు మీడియం స్కూలులో గురువారం కందుకూరి పురస్కార గ్రహీత ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ స్కూలు కరస్పాండెంట్ లక్షుమయ్య మాట్లాడుతూ సాహిత్య, నాటకరంగంలో బహుముఖ ప్రతి భను కనబరుస్తున్న మల్లికార్జునరెడ్డికి ప్రొద్దుటూరు చదువుల సాహిత్య కళా వేదిక వారు నటభూషణ బిరుదు, ఏపీ రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా కందుకూరి పుర స్కారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. మల్లికార్జునరెడ్డి గత 20 సంవత్సరాలుగా తనకు పరిచయమని.. ఏ పని అయినా నిబద్ధతతో చేస్తారన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌ను సత్కరించిన టీడీపీ నేత హరిప్రసాద్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎంఎస్ ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బి.హరిప్రసాద్ శాలువ కప్పి సత్కరించారు. గురువారం కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీడీపీ నేతలతో కలిసి పరిశ్రమల ఆవశ్యకతపై మంత్రితో చర్చించారు.

గర్భిణులందరికీ పీఎంఎవీవై లబ్ధి చేకూరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన గర్భిణులందరికి ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం (పీఎంఎవీవై) ద్వారా లబ్ధి చేకూర్చేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా పీడీ జయంతితో కలిసి ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భందాల్సిన తొమ్మిది నెలల్లోపు ఈ పథకానికి రిజిస్టర్ చేసుకోవా లన్నారు. ఇందుకు మొదట ప్రసవానికి మొదటి విడతలో రూ.3000, రెండవ విడతలో రూ.2000 లబ్ధిదారు ఖాతాలో జమ చేస్తారన్నారు. ఇందుకోసం అంగన్వాడీ టీచర్ గర్భిణీ హెల్త్ కార్డు, ఆర్‌సీఎస్ ఐడీ, ఆధార్ వివరాలు అడ్రస్ మొద లైనవి తీసుకొని వారి పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. అక్కడ నుంచి సూపర్‌వైజర్ లాగిన్‌కు వెళ్తుంది. ఫీల్డ్ వెరిఫి కేషన్ చేసి తన లాగిన్‌లో అప్రూవ్ చేస్తారన్నారు. అక్కడ నుంచి సీడీపీఓ లాగిన్‌కు వెళ్తుందని వివరించారు. పీడీ డీటైల్స్ వెరిఫై చేసి జిల్లా లాగి న్‌కు సబ్మిట్ చేస్తారన్నారు. అక్కడ నుంచి స్టేట్ వెళ్లి అమౌంట్ పడుతుందని వివరించారు. అదేవిధంగా రెండవ కాన్పులో కూడా కేవలం ఆడపిల్ల పుడితే మాత్రం ఇదే పథకం అమలు అవుతుంది. మగపిల్ల వాడు పుడితే వర్తించదన్నారు. మొదటి కాన్పులో ఎవరు పుట్టినా ఈ పథకం వర్తిస్తుంద న్నారు. రెండవ కాన్పులో ఈ పథకం కింద రూ.6000 వేలు ఇస్తార న్నారు. కార్యక్రమంలో జజెండర్ స్పెషలిస్ట్, మిషన్ శక్తి స్కీం, హెల్త్ డిపార్ట్‌మెంట్ల రీసోర్స్ పర్సన్లు, రెండు జిల్లాల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని సీనియర్ అసిస్టెంట్‌లు, బీపీసీలు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

కడపక్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం వద్ద బైకుపై వెళ్తున్న వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన ఎం.బాబ్జీ (37)పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి బైకులో వెళుతున్నాడు. అదే సమయంలో తుఫాన్ వాహనాన్ని బొలెరో వాహనానికి కట్టుకుని వస్తుండగా రామాంజనేయపురం వద్దకు రాగానే బొలెరో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబ్జీ మృతి చెందగా మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

దువ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ (48) అనే వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. ఇడమడకకు చెందిన రామకృష్ణ నాలుగు రోడ్ల రహదారి మీద వెళతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు పంపి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడి మృతి

● గోప్యంగా ఉంచుతున్న నిర్వాహకులు



బాలుడి మృతదేహం

కడపక్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఓ స్విమ్మింగ్ పూల్‌లో గురువారం సాయంత్రం ఈతకు వెళ్లిన బాలుడు మృతి చెందాడు. కడప గంజికుంట కాలనీకి చెందిన బాలుడు ఈత కోసం మాచుపల్లె రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. అయితే అక్కడ పిల్లలకు ఒకటి, పెద్దలకు ఒకటి వేర్వేరు ఈత కొలనులు ఉన్నాయి. అయితే లోతు ఎక్కువ ఉండటం, బాలుడికి ఈత రాకపోవడంతో నిమిషాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. గమనించిన అక్కడి వారు కేకలు వేయడంతో నిర్వాహకులు వచ్చి స్విమ్మింగ్ పూల్ నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. ప్రథమ చికిత్స అందించినప్పటికీ బాలుడికి చలనం లేకపోవడంతో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఆ స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు టీడీపీ నేత కావడం... ఇటీవల ఆ స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. అయితే ఈ విషయాన్ని నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. చిన్నచౌకు పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం.

'టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించండి'

వేంపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో మరమ్మత్తులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డితో కలిసి టీటీడీ సభ్యుడికి వినతిపత్రం అందించారు. కల్యాణ మండపం తెరిపిస్తే పేద, మధ్యతరగతి వారు పెళ్లిళ్లు చేసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గండి క్షేత్రాన్ని గతంలో టీటీడీలో విలీనం చేసుకున్నప్పుడు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నాటుసారా, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నగరిగుట్ట వీధుల్లో సిబ్బందితో పర్యటిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

పులివెందుల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని మత్తు పదార్థాల విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తెలవారుజామున నవోదయం 2.0 కార్యక్రమాన్ని నగరిగుట్టలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరిగుట్ట బి కేటగిరీ కింద ఉందన్నారు. రెండు నెలల్లో ఈ ప్రాంతాన్ని గ్రీన్ విలేజ్ - ఐడి ఫ్రీగా ప్రకటించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమ మద్యం విక్రయించే పాత నిందితులు మళ్లీ అక్రమ మద్యం కార్యకలాపాల్లో పాల్గొనవద్దని కఠినంగా హెచ్చరించామన్నారు. ప్రజల సహకారంతోనే నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరఫున రుణాలు ఇప్పించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, పులివెందుల రూరల్ సీఐ రమణ, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విస్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంటేశ్వర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేది వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ అధికారి వసంతకుమారి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిపుణులచే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో యోగా, స్పోకన్ ఇంగ్లీష్, మానవత విలువ, చిత్రలేఖనం ప్రావీణ్యం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

డిప్లమా కళాశాలకు స్థల పరిశీలన

కురబలకోట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప రోడ్డులో డిప్లమా కళాశాలకు స్థలాన్ని గురువారం పరిశీలించారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి రెండు కళాశాలలు మంజూరు కాగా వాటికి సంబంధించి స్థలాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి, తహశీల్దార్ తపస్విని, నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, డిప్లమా కళాశాల ప్రతినిధులు పరిశీలించారు.

అలరించిన కీచకవధ హరికథ

నిమ్మనపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం గ్రామంలో వెలసిన సాయిబాబా ఆలయంలో మహాభారతంలో కీచకవధ హరికథ ప్రజలను అలరించింది. గురువారం ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది వార్షికోత్సవం సందర్భంగా దాదాపు 18 రోజుల పాటు సాయిబాబా ఆలయంలో హరికథ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 7రోజులుగా పగటిపూట జరగుతున్న మహాభారతం గురించి కథకురాలు ఉషారాణి, తబలిస్టు రాజేష్, హార్మోనియం హరిలు హరికథ వినిపించారు. అలాగే హాజరయ్యే ప్రజలకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కురబలకోట, ఏప్రిల్ 24(ఆంధ్ర జ్యోతి): నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించినట్లు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్ కుమార్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దివారిపల్లెలో కార్డెన్ సర్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీలను నిర్వహించడం వలన గ్రామాలలో శాంతి భద్రతలను కాపాడవచ్చన్నారు.

పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

బి.కొత్తకోట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛను పొందుతూ మృతిచెందిన వారి భార్యలు స్పౌజ్ కింద కొత్త పింఛను పొందేందుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి పేర్కొన్నారు. 1డిసెంబరు 2023- 31అక్టోబరు 2024 మధ్యకాలంలో భర్తలు చనిపోయిన భార్యలకు ఈ అర్హత ఉంటుందన్నారు. ఈ అవకాశం కేవలం భర్తకు పింఛన్ వస్తూ చనిపోయిన వారి భార్యలకు మాత్రమే వర్తిస్తుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ములకలచెరువు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను దశలవారిగా వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం టమోటా మండీ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులకు తాగునీటి వసతి కల్పించి విశ్రాంతి భవనం నిర్మాణం త్వరితగతిన చేపడతామన్నారు. మార్కెట్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టమోటా మండీ యజమానులు కట్టా గోవిందునాయుడు, బాబునాయుడు, మోబీన్‌బాషా, రామకృష్ణ, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు సంఘీభావం



మానవహారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్ర జ్యోతి): ఏపీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు సంఘీభావం తెలపుతూ జనసేన నాయకులు నీరుగట్టువారిపల్లెలో మానవహారం నిర్వహించారు. గురువారం జనసేన నాయకుడు బండి మనోహర్ ఆధ్వర్యంలో రామమూర్తి, ఆంజనేయులు, నరేంద్ర సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ ఉగ్రవాదులు దాడి చేసి చంపడం దుర్మార్గ చర్య అన్నారు. కార్యక్రమంలో బండి మనోహర్ పాల్గొన్నారు.

ఉగ్రవాదులను తరిమికొట్టాలి







పీలేరులో న్యాయవాదుల నిరసన ర్యాలీ, వాల్మీకిపురంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం, కలికిరిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ముస్లిం సంఘాలు

● పీలేరులో న్యాయవాదుల నిరసన ర్యాలీ

పీలేరురూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను కూకటివేళ్లతో అణచివేయాలని పీలేరులో పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా పీలేరులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ కశ్మీర్ లోయలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. భారత్‌లో అలజడి సృష్టించడం కోసం పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను నడిరోడ్డులో ఉరితీయాలని డిమాండ్ చేశారు. కోర్టు నుంచి సదుం రోడ్, తిమ్మారెడ్డి క్రాస్, అజంతామిట్ట, పంచాయతీ కార్యాలయం, ఆర్టీసీ బస్టేషన్ మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీసీ పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కె.రామస్వామిరెడ్డి ఇతర కమిటీ సభ్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పీలేరు: భారతదేశంలో అంతర్గత కలహాలకు కారణమవుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించాలని పీలేరులోని ముస్లింలు, జనసేన నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ గురువారం వారు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో గురువారం సాయంత్రం పీలేరులోని ముస్లిం జమాత్ ఆధ్వర్యంలో ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు సంఘీభావం తెలిపారు. అంతకు మునుపు ఉదయం జనసేన నాయకులు స్థానిక మదనపల్లె టర్నింగ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. పీలేరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్ మాట్లాడారు. కార్యక్రమాల్లో పీలేరు సర్పంచ్ హబీబ్‌బాషా, అస్లం బాషా, హఫీజ్ బేగ్, ఇబ్రహీం, రియాజ్, అల్లాబక్ష్, జనసేన నాయకులు కలప రవి, మోహనకృష్ణ, గురుమోహన్, గజేంద్ర, రాజేశ్, ధనశేఖర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ముష్కరులను బహిరంగంగా ఉరి తీయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వాల్మీకిపురంలో రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా పహల్గాం దాడిని నిరసిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి బజారువీధి, ఎల్ఆర్ వీధి, రామాలయం రోడ్డు గుండా స్థానిక గాంధీబస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టి నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి నరేంద్రకుమార్‌రెడ్డి, విష్ణుచైతన్య, చంద్రమౌళి, అబ్దుల్‌కలీం, వెంకటరమణ, మల్లికార్జునరెడ్డి, పీవీ నారాయణ, ఆనంద్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

కలికిరి: కశ్మీర్ పహల్‌గామ్‌లో జరిగిన మతోన్మాద మారణకాండకు నిరసనగా గురువారం ఉలమాలు, స్థానిక ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదులకు చెందిన ఉలమాలు, ముత్తవల్లీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, వేంపల్లె అబ్దుల్ ఖాదర్, వైజాగ్ బాషా, జాఫర్ హజరత్, కరీముల్లా, ఉలివెల్లా, వర్మ, జ్ఞాన పాల్గొన్నారు.

మదనపల్లెటౌన్: దేశంలోని మతఛాందసవాద ఉగ్రవాదులను తరిమి కొడితేనే శాంతిభద్రతలు నెలకొల్పినట్లు అని అఖండ నవభారత్ నిర్మాణ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నారదరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని ఏఎన్‌బీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారదరెడ్డి మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గావ్ వద్ద ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన 28 మంది పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రజలందరూ దేశభక్తి చాటుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెకు రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

● టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, కురబలకోట మండలాల్లో పాల్‌టెక్నిక్ కళాశాల మంజూరుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గత ఫిబ్రవరి నెలలో తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి కలిసి నియోజకవర్గానికి డిగ్రీ, జూనియర్, పాల్‌టెక్నిక్ కళాశాలలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో మంత్రి లోకేష్ పాల్‌టెక్నిక్ కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ గణేష్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు పంపాలని కలికిరి ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, హెచ్ఓడీ శివరామకృష్ణ బృందానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం జయచంద్రారెడ్డితో కలిసి బృందం సభ్యులు ములకలచెరువు సమీపంలో స్థలాలను పరిశీలించారు. అలాగే కురబలకోట మండలం అంగళ్లు వద్ద స్థల పరిశీలన చేశారు. ములకలచెరువు, కురబలకోట మండలాల్లో పాల్‌టెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

భవన యజమానులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 'నడిరోడ్లపై ట్రాన్స్‌ఫార్మర్లు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత నెల 22న ప్రచురితమైన వార్తకు మున్సిపల్, ఎస్పీడీసీఎల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ స్థలాల్లో ఏర్పాటు చేసిన ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని సంబంధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. మదనపల్లె పట్టణంలో 90 దాకా ఐదంతస్థుల భవనాలు నిర్మించగా, వాటిలో చాలా వరకు విద్యుత్ సరఫరా కోసం ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు. నిబంధనల ప్రకారం ఆయా భవన యజమానుల సొంత స్థలాల్లోనే ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు దిమ్మెలు కట్టి బిగించుకోవాలి. కానీ మదనపల్లెలో చాలా వరకు భవన యజమానులు ఆ భవనాల ఎదురుగా వున్న మున్సిపల్ స్థలాల్లో ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మెలు కట్టి బిగించేశారు. దీంతో ఈ దిమ్మెలతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడలు లేకపోవడంతో అటువైపు వెళ్లే ప్రజలకు విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఈ అంశమై సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌కు, మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతులు అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో ఎట్టకేలకు ఎస్పీడీసీఎల్ అధికారులు ఆయా భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ స్థలాల్లో 30 దాకా ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్లు వున్నట్లు గుర్తించామని, వీటిని తొలగించి భవన యజమానుల సొంత స్థలాల్లోకి మార్పు చేయాలని నోటీసులు ఇచ్చామన్నారు. నిర్దేశిత గడువులో ట్రాన్స్‌ఫార్మర్ మార్చకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈఈ స్పష్టం చేశారు.

వ్యవస్థలను పటిష్ఠం చేయాలి

● ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను పటిష్ఠం చేయడంలో కార్యదర్శులు ముందుండాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

రాజంపేటటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మన్నూరులో వెలసిన గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున పోతులరాజు ఊరేగింపుగా గంగమ్మను తీసుకురాగా అమ్మవారికి మహిళలు తమ భక్తిని చాటుకున్నారు. తమ ఇంటి ముందుకు రాగానే సంప్రదాయబద్ధంగా ముద్దలు పెట్టుకుని జంతుబలులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గుడి లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. రాజంపేట చుట్టుపక్కల నుంచి భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు నేతలు, ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి జ్యోతిని చూడడానికి దారిపొడవునా జనం కిటకిటలాడారు. కాగా ఈ జాతర శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగుతుంది.

గురుకులాల్లో బి.కొత్తకోటకు ప్రథమస్థానం

● ఎస్ఎస్‌సిలో 576 మార్కులు సాధించిన గోపీచంద్



బి.కొత్తకోట, ఏప్రిల్ 24(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (ఏపీ డబ్ల్యుఆర్‌ఈఐయస్)లలో మండలంలోని మల్లెల రోడ్డులో వున్న గురుకుల పాఠశాల విద్యార్థి పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచాడు. ఈ పాఠశాలలో చదివిన బి.గోపీచంద్ 576 మార్కులతో కడప, అన్నమయ్య జిల్లాలో మొదటి స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ వాసుదేవరావు గురువారం తెలిపారు. ఈ రెండు జిల్లాలలో 22 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉండగా వాటిలో బి.కొత్తకోటకు ప్రథమ స్థానం దక్కింది. విద్యార్థి తల్లిదండ్రులు బట్టు వెంకటేశులు, భార్గవిలు తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో వార్డుబాయ్స్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. కాగా కడప జిల్లా రాజుపాళెం గురుకులానికి చెందిన యం.వంశిత 571 మార్కులతో, మదనపల్లె పాఠశాలకు చెందిన యం.సరయూ 571 మార్కులతో ద్వితీయ స్థానం, కడప జిల్లా గుండ్లకుంటకు చెందిన పి.సౌభాగ్య తృతీయ స్థానం సాధించారు. కాగా బి.గోపీచంద్‌ను ప్రిన్సిపాల్ వాసుదేవరావు, సిబ్బంది అభినందించారు.

టపాసుల గోదాము తనిఖీ



టపాసుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, పట్టణంలోని టపాసుల గోదాములను, క్రాకర్స్ గోదాములను గురువారం మదనపల్లె తహసీల్దార్ ధనంజయులుతో పాటు పోలీస్‌శాఖ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్ శివప్పలు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని వలసపల్లె సమీపంలో, వేంపల్లె క్రాస్ గోదాములను, మదనపల్లె పట్టణంలోని లైసెన్స్‌లున్న టపాసుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. పోలీసుశాఖ, లేబర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్‌పై విచారణ



పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లీలను విచారిస్తున్న శైలజ

రామసముద్రం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లీలపై వచ్చిన పలు ఆరోపణలకు సంబంధించి జిల్లా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ శైలజ గురువారం రామసముద్రం పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు మెడికల్ ఆఫీసర్ లీలపై పలు ఆరోపణలు చేస్తూ జిల్లా మెడికల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఇదిలా ఉండగా మెడికల్ ఆఫీసర్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గత వారం క్రితం మండల పర్యటనకు వచ్చినప్పుడు పీహెచ్‌సీ సిబ్బందితో విచారణ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

సుధాకర్‌కు డాక్టరేట్ ప్రదానం



గురువు చేతులమీదుగా డాక్టరేట్ అందుకుంటున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామం కోటవీధికి చెందిన సుధాకర్‌కు గౌరవ డాక్టరేట్ వరించింది. సెల్యూట్ అచీవర్స్ సొసైటీ ఢిల్లీ వారు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. చిన్నతనం నుంచి శ్రద్ధగా చదివి ఎస్వీ యూనివర్సిటీలో ఎంకాం, అన్నా యూనివర్సిటీలో ఎంబీఏ పట్టా పొందారు. బోధన వృత్తిపై ఆసక్తితో ప్రైవేట్ కళాశాలల్లో ఉద్యోగం నిర్వహిస్తూ అక్షర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి కొన్ని వేల మందికి విద్యనందించారు. అంతేగాకుండా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మన్ ఆఫ్ లెటర్స్ అవార్డును పొందారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

'నల్లబెల్లం విక్రయిస్తే చర్యలు'



బెల్లం నిల్వలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కలకడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులకు నల్లబెల్లాన్ని విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్ వ్యాపారులను హెచ్చరించారు. గురువారం సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు దుకాణాలు, గోడౌన్లను తనిఖీ చేసి బెల్లం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెల్ల, నల్ల బెల్లం విక్రయాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పరిమాణం మేరకు విక్రయాలు జరిపి కొనుగోలుదారుల పేరు, చిరునామా, ఫోన్ నెంబరు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ జోగేంద్ర, ఈఎస్‌టీఎఫ్ సీఐ యల్లయ్య, ఎస్ఐ శశిధర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మహమూద్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయలంలోని సమావేశ మందిరంలో గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సర్పంచ్ గంగులమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలు అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక, మున్ముందు చేపట్టనున్న పనుల ప్రణాళికలపై చర్చించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రాజు, ఈవోఆర్‌డీ సుధాకర్, వాల్మీకిపురం ఈవో రవీంద్రనాథ్, మార్కెట్ చైర్మన్ చంద్రమౌళి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ కేశవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పీలేరు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం పీలేరు ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ హబీబ్‌బాషా, ఈవో గురుమోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు సంయుక్త, జ్ఞానశేఖర్, శివాజీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నాగేంద్ర, జన పాల్గొన్నారు.

కురబలకోట: పంచాయతీల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థతోనే గ్రామాలను మరింతగా అభివృద్ధి చేయవచ్చన్నారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవానికి ప్రజాప్రతినిధుల డుమ్మా



కేవలం ఉద్యోగులతో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహిస్తున్న ఏవో మస్తాన్

మదనపల్లెటౌన్: వారంతా ప్రజల చేత ఓట్లు వేయించుకుని ప్రజాప్రతినిధులుగా నాలుగేళ్లు మండల పరిషత్ పాలన సాగించిన వారే. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవానికి మాత్రం ఒక్కరు కూడా రాకపోవడంతో వారికి పంచాయతీరాజ్ చట్టంపై ఏమాత్రం గౌరవముందో అర్థమవుతోంది. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాలు నిర్వహించారు. కానీ మదనపల్లెలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడుతో పాటు కనీసం ఒక్క ఎంపీటీసీ సభ్యుడు, సభ్యురాలు కూడా హాజరు కాలేదు. దీంతో కార్యాలయ ఏవో మస్తాన్ అప్పటికప్పుడు ఎంపీడీవో కార్యాలయం పక్కన వున్న ఎంఈవో, ఉపాధి, హౌసింగ్ కార్యాలయాల ఉద్యోగులను పిలిచి ఎలాగోలా కార్యక్రమాన్ని మమ అనిపించారు.

130 మందికి కంటి పరీక్షలు

గుర్రంకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుర్రంకొండ జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 130 మందికి వైద్య పరీక్షలు చేసి 47 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, గౌరీశంకర్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.